సంతృప్తిగా తింటున్నారా..

- అన్నక్యాంటీన్ల నిర్వహణ పర్యవేక్షణకు ప్రత్యేక అడ్వైజరీ కమిటీలు
- ఆహార నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు
- జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అన్నక్యాంటీన్ల నిర్వహణ



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీనులో నాణ్యమైన భోజనం పారదర్శకంగా అందించేందుకు నిర్వహణను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్నక్యాంటీన్ స్థాయిలో ప్రత్యేక అడ్వైజరీ కమిటీలను ఏర్పాటుచేయడానికి నిర్ణయించి ఉత్తర్వులు జారీచేసింది. అన్నక్యాంటీన్ల నిర్వహణ, లబ్ధిదారుల సంతృప్తిస్థాయిలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతోపాటు ఆహారంలో లోపాలు లేకుండా లబ్ధిదారులకు అందించేందుకు ఈ కమిటీలు కీలకంగా పనిచేయనున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీల్లో మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, చైర్మన్‌గా లేదా కార్పొరేటర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత అన్నక్యాంటీను నోడల్ ఆఫీసర్ కన్వీనర్‌గా ఉంటారు. శానిటేషన్, ఎన్విరాన్‌మెంటల్ వార్డు సెక్రటరీ, వార్డు ఉమెన్ వీకర్స్ సెక్షన్ సెక్రటరీ స్థానికంగా ఎన్జీవో సంస్థ నుంచి ప్రతినిధి ఎస్‌హెచ్‌జీ, పీఎల్ఎఫ్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. అన్న క్యాంటీనులో ఈ కమిటీ ప్రధానంగా లబ్ధిదారులకు అందించే ఆహార నాణ్యత, పరిశుభ్రతపై కఠిన పర్యవేక్షణ, ప్రతీ భోజనానికి డైలీ ఫుడ్ టేస్ట్ టెస్ట్, క్యాంటీను ఆపరేషన్లపై రోజువారీ, వారపు రికార్డులు, సీసీటీవీ, ఎఫ్ఆర్ఎస్ వంటి టెక్నాలజీ పరికరాల పరిశీలన, లబ్ధిదారుల నుంచి అందించే ఫుడ్ విషయంపై ఫీడ్‌బ్యాక్ సేకరణ, సేవల్లో లోపాలు ఉంటే తక్షణమే పరిష్కారం, కమ్యూనిటీ భాగస్వామ్య వలంటీర్ల సమన్వయం, ప్రభుత్వ ఆమోదిత వారపు మెనూ పరిశీలన చేయడం ఈ కమిటీ బాధ్యత, రానున్న రోజుల్లో జిల్లాలోని అమలాపురం, ముమ్మిడివరం, మండపేట, కొత్తపేట, రామచంద్రపురంతో సహా వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్న క్యాంటీన్ల నిర్వహణను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల అన్న క్యాంటీన్‌లో భోజన సదుపాయంలో మరింత నాణ్యత పెరగనుందని లబ్ధిదారులు భావిస్తున్నారు.

సివిల్ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం డిసెంబరు 3 వరకు గడువు పెంపు

బీసీ సంక్షేమ జిల్లా అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి

అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ బీసీ స్టడీ సర్కిల్ విజయవాడవారి ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత కోచింగ్ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు బీసీ సంక్షేమ, సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి ఓ ప్రకటనలో కోరారు. ఈ సివిల్ సర్వీసు పరీక్షలకు ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తులను జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారికి అందజేయాలని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం దరఖాస్తు చేసుకునేందుకు గడువును డిసెంబరు 3వ తేదీ వరకు పొడిగించిందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె విజ్ఞప్తిచేశారు. ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారని, ఇందులో బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14శాతం రిజర్వేషన్ల ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారికి విజయవాడ బీసీ భవన్‌లో సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఈ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసే అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల లిస్టులు, కుల ధ్రువీకరణపత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కాపీ, బ్యాంకు పుస్తకం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

లెక్కకు..చిక్కేనా!

పులుల జాడెక్కడ



- అభయారణ్యంలో రేపటి నుంచే గణన
- 3 రోజులు అడవిలో అడుగుజాడల గుర్తింపు
- 2022లో 6 చిరుతలు, 4 పెద్దపులులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అడవుల్లో పులుల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. పాపికొండల అభయారణ్యం, కాకినాడ, ఏలేశ్వరం అటవీ డివిజన్లలో వీటి సంఖ్య లెక్కించేందుకు సోమవారం నుంచి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. తొలి మూడు రోజులు రోజుకు ఐదు కిలోమీటర్ల పాటు అడవుల్లో తిరిగి వీటి అడుగులు, ఇతర గుర్తులు సేకరించనున్నారు. ఆ తర్వాత ట్రాన్సెక్ట్ లైన్ ఏర్పాటుచేసి దాని వెంబడి 280కిపైగా ట్రాప్ కెమెరాలు బిగించి పులులను లెక్కించనున్నారు. 2022లో నిర్వహించిన సర్వేలో పాపికొండల్లో ఆరు చిరుతలు, నాలుగు పెద్ద పులులు గుర్తించారు. ట్రాప్ కెమెరాకు చిక్కని పులులు ఎక్కువగానే ఉండొచ్చని తేల్చారు. గతేడాది సెప్టెంబరులో పాపికొండల నుంచి పులులు దారితప్పి రాజమహేంద్రవరం పుష్కరవనం, ప్రత్తిపాడులో సంచరించి బెంబేలెత్తించాయి.

నాలుగేళ్లకు ఒకసారి..

పాపికొండల అభయారణ్యంతోపాటు కాకినాడ, ఏలేశ్వరం, రంపచోడవరం అటవీ డివిజన్లలో పులులు, చిరుతలు ఎన్ని ఉన్నాయనే దానిపై అటవీ శాఖ నాలుగేళ్లకోసారి పులుల లెక్కింపు చేపడుతోంది. చివరిగా పాపికొండల్లో 2022లో పులుల లెక్కింపు జరిగింది. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ జిల్లాల్లోని అభయారణ్యంలో రెండు దశల్లో చెరో 45 రోజులు 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసి సంఖ్య లెక్కించారు. అందులో భాగంగా నాలుగు పెద్ద పులులు, ఆరు చిరుతలు ఉన్నట్టు తేల్చారు. ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మరో పది వరకు ఉండొచ్చని అంచనా వేశారు. రంప చోడవరం, మారేడుమిల్లి అడవుల్లో పులులకంటే చిరుతల సంచారం అధికంగా ఉందని నిర్ధారించారు. అంతకుముందు 2018లో నిర్వహించిన సర్వేలో ట్రాప్ కెమెరాలకు పులులు, చిరుతలు చిక్కలేదు. దీంతో ఆ ఏడాది సర్వే వివరాలను బయటపెట్టలేదు.

పులుల ఆవాసం అక్కడే..

పులులు, చిరుత పులులకు పాపికొండల అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, అల్లూరి జిల్లా ఏజెన్సీ కలిపి మొత్తం 2.6 లక్షల ఎకరాల్లో పాపికొండలు విస్తరించి ఉన్నాయి. మొత్తం 391 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్న పాపికొండల మధ్యలో గోదావరి ఉంది. అందుకే పులుల ఆవాసానికి పాపికొండలు ప్రసిద్ధి. పులులు గోదావరికి అటూఇటూ తిరుగుతుంటాయి. దట్టమైన అటవీప్రాంతం కావడంతో అనేక రకాల పక్షులు, జంతువులు సైతం సంచరిస్తుంటాయి. ఆహారం, నీటికి పులులకు పాపికొండల్లో ఢోకా ఉండదు. దీంతో పాపికొండల అభయారణ్యంలో పులుల సంచారం అధికం. ఇంత అనుకూల వాతావరణం ఉండడంతో ఏటా వీటి సంతానం వృద్ధి చెందుతోంది.

పులుల సర్వే చేస్తారిలా..

సర్వేలో పులులు, చిరుతల లెక్క పక్కాగా తేల్చడానికి అటవీ శాఖ నాగార్జున సాగర్- శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్), వైల్డ్‌లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ ఐఐ) నిపుణులతో కలిసి పనిచేయనుంది. ఫిబ్రవరి మొదటి వారానికి పులులు, చిరుతల సంఖ్య తేలనుంది. ఈ దఫా పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో ఉన్న నాలుగు పెద్దపులులు, ఆరు చిరుతలు రెట్టింపునకు పైగా ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రధానంగా గడచిన కొన్నేళ్లలో వీటి సంతానం బాగా వృద్ధి చెంది ఉంటుందని విశ్లేషిస్తున్నారు. పైగా గతేడాది పాపికొండల నుంచి దారితప్పి పులులు బయటకు వచ్చిన సంఘటనలను విశ్లేషిస్తున్నారు.

280 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు

20 బీట్ల పరిధిలో పులుల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలి మూడు రోజుల పాటు అభయారణ్యం, అటవీ డివిజన్లలో ఒక్కో రూట్‌లో రోజుకు ఐదు కిలోమీటర్ల చొప్పున అటవీ సిబ్బంది అడవిలో తిరగనున్నారు. పులులు, చిరుతలు,ఇతర మాంసాహార జంతువుల పాద ముద్రలు, ఇతర గుర్తులు సేకరిస్తారు.ఈ వివరాలను ఎం-స్ట్రైప్స్ యాప్‌లో నమోదు చేస్తారు. డిసెంబరు 6 నుంచి 8 వరకు అభయారణ్యంలో ట్రాన్సెక్ట్ లైన్ సిద్ధం చేస్తారు. నెలాఖరుకు గుర్తించిన ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. పాపికొండల అభయారణ్యం పరిధిలో, 220, కాకినాడ, ఏలేశ్వరం డివిజన్లలో 60 కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

రంపచోడవరంలో వాయిదా

గతేడాది సెప్టెంబరులో రాజమహేంద్రవరం నగరంలోకి చిరుత దారితప్పి వచ్చింది. పాపికొండల అభయారణ్యం విస్తరించిన వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోకవరం మీదుగా చిరుత రాజమహేంద్రవరంలోకి దారి తప్పి వచ్చి ఉండొచ్చని భావించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంచారం బాగా పెరిగిందని అటవీశాఖ అంచనా వేస్తోంది. రంపచోడవరం అటవీ డివిజన్ పరిధిలో ఇటీవల మావోల సంచారం నేపథ్యంలో తాత్కాలికంగా ఇక్కడ పులుల గణన వాయిదా వేసినట్టు అటవీశాఖ తెలిపింది.

డిసెంబరు 5న మెగా పేరెంట్-టీచర్స్ మీట్

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కలిసి పనిచేసే ఉత్తమ అవకాశాన్ని మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ చక్కటి వేదిక అవుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 5న మెగాపేరెంట్, టీచర్ మీట్ 3.0 షెడ్యూల్ ప్రకారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లుచేయాలని సూచించారు. తల్లిదండ్రులతో మమేకమై పనిచేసేందుకు ఈ సమావేశం వేదిక అవుతుందన్నారు. అపార్ ఐడీ తప్పనిసరి అన్నారు. పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. ఎటువంటి హంగామాలు లేకుండా సమావేశాలు మర్యాదపూర్వకంగా నిర్వహించాలని సూచించారు. సంస్కృతి సంప్రదాయాలతో పాఠశాలను అలంకరణ చేయడం, శుభ్రత, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాల కల్పన విషయంలో దృష్టిసారించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల హాజరుశాతం, నడవడిక వంటి విషయాలను ఈ సమావేశంలో తల్లిదండ్రులతో మమేకమై చర్చించాలని మార్గదర్శకాల్లో సూచించారు.

షెడ్యూలు ఇలా..

డిసెంబరు 5వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు మెగా పేరెంట్ సమావేశం నిర్వహించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వపు విద్యార్థులు హాజరవుతారు. మొదటి 80 నిమిషాలు ఎఫ్ఎల్ఎం అసైన్‌మెంట్ బుక్‌లెట్లపై సమీక్ష, గ్రంథాలయ పుస్తకాల ప్రదర్శన, తదుపరి పది నిమిషాలు పాఠశాలకు ప్రభుత్వపరంగా సమకూరుతున్న సదుపాయాలు, అభివృద్ధిపై సమీక్ష, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ, తల్లిదండ్రులు, టీచర్లు విద్యార్థుల భవిష్యత్తుపై చర్చించాలి. అనంతరం సహపంక్తి భోజనం చేయాలి.

మరో 5 వంతెనల నిర్మాణాలకు సహకరించాలి

ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్యే అయితాబత్తుల వినతి



ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు మరో ఐదు వంతెనలు నిర్మించేందుకు సహకరించాలని కోరుతూ ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం కలసి వినతిపత్రం అందజేశారు. ట్రాఫిక్ సమస్యలను అధిగమించే లక్ష్యంతో ఇప్పటికే రెండు వంతెనల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. మరో ఐదు వంతెనలకు వచ్చే వేసవిలో శంకుస్థాపనలు చేయనున్నట్టు మంత్రికి ఆయన వివరించారు. వంతెనల నిర్మాణానికి సహకారం అందించాలని మంత్రి జనార్దన్‌ను ఆయన కోరగా, తనవంతుగా నిధులు మంజూరు చేయిస్తానని సెక్రటేరియట్‌లో హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు.



పంటపొలాల్లోకి చేరిన ఉప్పునీరు

పంటపొలాల్లోకి పోటెత్తిన ఉప్పునీరు

- అకాల పోటుకు హడలెత్తుతున్న రైతులు
- గొరగనమూడి డ్రెయిన్ నిర్లక్ష్య ఫలితమే అంటున్న అన్నదాతలు

ఉప్పలగుప్తం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో నుంచి ముంపునీరు డ్రెయిన్లలోకి ప్రవహించడం సాధారణం. ముంపు సమయాల్లో ఇలా జరగడం రైతులకు అనుభవమే. అయితే ముంపు సమస్య లేని సమయంలో డ్రెయిన్ల నుంచి పంట చేలల్లోకి నీరు పోటెత్తడం రైతులకు మింగుడు పడడంలేదు. అది కూడా ఉప్పునీరు కావడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఉప్పలగుప్తం మండలంలోని గొరగనమూడి డ్రెయిన్ ద్వారా ప్రస్తుతం పంట పొలాల్లోకి నీరు పోటెత్తుతోంది. ఇప్పటికే గొరగనమూడి ఆయకట్టు పొలాల్లో చాలావరకు సార్వాకు సెలవు ప్రకటించారు. సాహసం చేసి సార్వా నాట్లు వేసిన వారు నిండా మునిగారు. నిన్న, మొన్నటి వరకు పొలాల్లో నుంచి డ్రెయిన్‌లోకి ఎంతో కొంత నీరు దిగుతుంటే దాళ్వా సాగుకు అవకాశం ఉంటుందని ఆయకట్టు రైతులు భావించారు. ఇప్పుడు అకస్మాత్తుగా సీన్ రివర్స్ అయ్యింది. చేలల్లోకి నీరు పోటెత్తడంతో రైతులు అయోమయంలో పడ్డారు. గొరగనమూడి డ్రెయిన్‌లో మెరకలు తియ్యాలని, గట్లపై ఆక్రమణలు తొలగించాలని చాలాకాలంగా రైతులు పోరు పెడుతున్నారు. ఏటా సార్వా నాట్లు వేయడం తర్వాత నీటిపాలు కావడంతో రైతులను నష్టాల ఊబిలో పడేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్ల నుంచి గొరగనమూడిని ఆధునికీకరించాలని రైతులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ వచ్చారు. ఎట్టకేలకు డ్రెయిన్ ఆధునికీకరణకు రూ.66 లక్షలు మంజూరైనట్టు డ్రెయిన్స్ అధికారులు ప్రకటించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు భూమిపూజ కూడా చేశారు. డ్రెయిన్ గట్లపై ఆక్రమణల తొలగింపు, డ్రెయిన్‌లో మెరకలు తీసేందుకు అధికారులు అంచనాలు తయారు చేశారు. ఆక్రమణల తొలగింపునకు సర్వే కూడా జరిగింది. అంతే అక్కడితో డ్రెయిన్ ఆధునికీకరణకు ఫుల్‌స్టాప్ పడింది. పనులు ఎందుకు ప్రారంభించడం లేదన్న రైతుల ప్రశ్నలకు రకరకాల సమాధానాలు వచ్చాయి. మొత్తం మీద గొరగనమూడి ఆధునికీకరణ ఆగిపోయింది. దాని ఫలితమే ఇప్పుడు అనుభవిస్తున్నామని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరీ ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడో? దాళ్వా నాట్లు వేసుకునేందుకు అవకాశం ఉంటుందో లేదో? ఈ ప్రశ్నలకు అధికారులే జవాబివ్వాలి.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలి

- పోలీసు యంత్రాంగానికి జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశం
- నెలవారీ నేర సమీక్షలో కేసుల పురోగతిపై సమీక్ష



జిల్లా పోలీసు కార్యాలయంలో నేరాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రాహుల్‌మీనా, ఏఎస్పీ ప్రసాద్

అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించడమే ప్రధాన లక్ష్యంగా పోలీసు యంత్రాంగం పనిచేయాలని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా విజ్ఞప్తి చేశారు. కేసుల దర్యాప్తులో జాప్యం ఉండకూడదని, ప్రత్యేకించి మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్లను దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతీ అధికారి తమ పరిధిలో శాంతి భద్రతలు కాపాడడంలో రాజీపడకుండా పనిచేయాలని ఎస్పీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం అమలాపురంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో రాహుల్ మీనా అధ్యక్షతన అన్ని పోలీసుస్టేషన్ల అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులపై సమీక్షించారు. ప్రజల ఫిర్యాదులు పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, పిటిషన్లను తక్షణమే పరిష్కరించి బాధితులకు సత్వరం న్యాయం అందించాలని సూచించారు. తీవ్రమైన కేసులపై దర్యాప్తు పురోగతిని సమీక్షించి నేరస్తులకు త్వరగా శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలను సేకరించాలని సూచించారు. ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో వచ్చిన భారతీయ న్యాయ సంహిత కింద నమోదైన అన్ని కేసులను ముఖ్యంగా 194 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ కేసులను వేగవంతంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. అదృశ్యమైన వారి కేసులకు ప్రాధాన్యత ఇచ్చి పరిశోధించాలని, ముఖ్యంగా గ్రీవ్ ఫోర్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై సమగ్ర విశ్లేషణచేసి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచించారు. లోక్ అదాలత్ లక్ష్యాలను చేరుకోవడానికి వీలుగా కేసుల గుర్తింపు, కౌన్సిలింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎస్పీ ఆదేశించారు. నేర సమీక్షలో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం డీఎస్పీలు టీఎస్ఆర్కే ప్రసాద్, ఎస్.మురళీకృష్ణ, రఘువీర్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వాడి వేడిగా మండపేట కౌన్సిల్ సమావేశం

- మున్సిపల్ సమావేశానికి తనను పిలవలేదంటూ ఎమ్మెల్సీ నిరసన
- కమిషనర్‌కు, తోటకు వాగ్వాదం
- ఎమ్మెల్యే వేగుళ్ల జోక్యంతో సర్దుబాటు



మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ మృతికి సంతాపం తెలియజేస్తున్న కౌన్సిల్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మండపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి)! మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి తనను పిలవకపోవడంపై వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం జరిగిన మున్సిపల్ సమావేశంలో నిరసన వ్యక్తంచేశారు. 2023 నుంచి కౌన్సిల్‌కు వస్తున్న తనను ఎందుకు ఈసారి పిలవలేదంటూ కమిషనర్ రంగారావును నిలదీశారు. దీంతో 40 నిమిషాలపాటు ఇద్దరి మధ్యా వాగ్వాదం జరిగింది. పిలవకపోవడంపై కారణం చెప్పడంతోపాటు తనకు లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని కమిషనర్‌ను తోట డిమాండ్ చేశారు. తాను సమావేశానికి వచ్చేందుకు వీలుగా డీఎంఏ నుంచి అప్పటి ఐఏఎస్ అధికారి ముత్యాల రాజు ఇచ్చిన అర్డర్‌ను కమిషనర్‌కు తోట చూపించారు. అయితే తర్వాత వచ్చిన అధికారి ఎమ్మెల్సీని సమావేశానికి పిలవాలంటూ ఏమీ ఉత్తర్వులు జారీచేయలేదని కమిషనర్ చెప్పడంతో ఏ అధికారి చెప్పారంటూ తోట నిలదీశారు. దీంతో సమావేశం జరిగేందుకు సహకరించాలని ఎమ్మెల్యే వేగుళ్ల, కౌన్సిలర్‌లు ఒక్కసారిగా నిలబడి కోరడంతోపాటు ముందు సమావేశం జరగనివ్వండి, లేకుంటే మేం కూడా కూర్చోమని.. సమావేశం వాయిదా వేయిస్తామంటూ వేగుళ్ల చెప్పడంతో.. తోట అలా వద్దని, సమావేశం కానివ్వడంటూ శాంతించారు. చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి మాట్లాడుతూ అజెండాను ఎమ్మెల్సీ తోటకు పంపమని తాను చెప్పానని, పంపకపోవడం కమిషనర్‌దే తప్పని అన్నారు. చివరకు డీఎంఏకు రాసిన తర్వాత ఆయన ఆదేశాలు మేరకు ముందుకు సాగుతానని కమిషనర్ చెప్పారు. అలాగే 2023 ఏప్రిల్ నుంచి కౌన్సిల్ సమావేశానికి హాజరవుతున్న ఎమ్మెల్సీ తోటకు గౌరవ వేతనం ఇస్తున్నారా అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కమిషనర్‌ను ప్రశ్నించగా, గౌరవ వేతనం ఇస్తున్నామని కమిషనర్ చెప్పారు. తనకు గౌరవ వేతనం గురించే తెలియదని ఎమ్మెల్సీ తోట అన్నారు. ఎమ్మెల్సీ బ్యాంకు ఖాతా లేకపోవడంతో మున్సిపల్ ఖాతాలోనే ఉందని కమిషనర్ చెప్పారు. అసలు తనకు తెలియకుండా ఎందుకు గౌరవవేతనం ఇస్తున్నారంటూ తోట ప్రశ్నించడంతో కమిషనర్ సమాధానం ఇవ్వలేదు. కాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలుపుతూ ప్రభుత్వం జీవో జారీచేయడం పట్ల కౌన్సిల్ సమావేశం హర్షం వ్యక్తంచేసింది. విలీనం కోసం ఎంతగానో పోరాటం చేసి సాధించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును చైర్‌పర్సన్ రాణితోపాటు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కౌన్సిలర్‌లు అభినందించారు.

ప్రకాష్ మృతికి సంతాపం..

మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చండ్రు శ్రీవరప్రకాష్, అకస్మికంగా గుండెపోటుతో మరణించడం పట్టణానికి, టీడీపీకి తీరనిలోటని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రకాష్ మృతికి సంతాప ప్రకటన చేస్తూ నివాళులర్పించారు. వేగుళ్లతోపాటు ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ రాణితో కలిసి కౌన్సిల్ మౌనం పాటించింది. మాజీ కౌన్సిలర్ వేగుళ్ల రామ్మోహన్‌రావు మృతికి సంతాపం ప్రకటించింది.

మేమూ ఆడేస్తాం.. 7
- అమలాపురంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు

శ్రీనివాస.. గోవిందా.. 6
- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రపంచ కరెన్సీ అంతా ఇక్కడే..


ప్రపంచంలోని 65దేశాల కరెన్సీ నోట్లు, నాణేలు

- 65 దేశాల నోట్లు, నాణేల ప్రదర్శన
- 50 దేశాల పోస్టల్ స్టాంపులు, కవర్లు సేకరించి ప్రదర్శించిన పవర్‌ప్లాంటు ఉద్యోగి
- ఆసక్తికరంగా తిలకించిన విద్యార్థినులు

ప్రపంచంలోని పలు దేశాల కరెన్సీ అంతా ఒకేచోటకు చేరింది. అదే రీతిలో పోస్టల్‌కు వినియోగించే స్టాంపులు, కవర్లును ప్రదర్శించారు. ఒక పవర్‌ప్లాంటు ఉద్యోగి చిన్ననాటి ఆసక్తితో చేసిన ఈ సేకరణ అబ్బురపరిచేలా ఉంది. సేకరించడమేగాక వాటిని విద్యార్థులకు ప్రదర్శిస్తూ ఇటువంటి సేకరణలపై వారికి ఆసక్తి కలిగించే ప్రయత్నం చేశారు.

(గొల్లప్రోలు-ఆంధ్రజ్యోతి)

ఒకరి వద్ద ఆ దేశానికి సంబంధించిన అన్ని రకాల కరెన్సీ, నాణేలు అందుబాటులో ఉండవు. అటువంటి 65 దేశాలకు చెందిన కరెన్సీ, నాణేలును సేకరించాడు. ఇవే కాదు 50దేశాలకు చెందిన పోస్టల్ కవర్లు, స్టాంపులు సేకరించి భద్రపరిచి అందరికీ ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్నారు పిఠాపురం పట్టణంలో నివాసముంటున్న ఏఎం చంద్రశేఖర్. తమిళనాడుకు చెందిన వీరి కుటుంబం తండ్రి పిఠాపురం షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేసే సమయంలో ఇక్కడ స్థిరపడింది. చంద్రశేఖర్ నెల్లూరులోని పవర్‌ప్లాంటులో మెకానికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఈయన చిన్నతనం నుంచి ఎవరైనా ఇచ్చిన నోట్లు, నాణేలు భద్రపరిచేవారు. తండ్రి ఉద్యోగరీత్యా వివిధ ప్రదేశాలకు వెళ్లిన భిన్నమైన కరెన్సీ చూసి వాటిని సేకరించేవారు. అన్నిదేశాల కరెన్సీ సేకరిస్తే బాగుంటుందని ఆసక్తితో సేకరించడం మొదలుపెట్టారు. 2006 నుంచి మొదలుపెట్టి 65 దేశాల కరెన్సీ, నాణేలు సేకరించారు. కనీసం 150 దేశాల కరెన్సీ సేకరించే లక్ష్యంతో ఉన్నాడు. అదేవిధంగా 50దేశాల్లో వినియోగించే పోస్టల్ కవర్లు, స్టాంపులు సేకరించారు. మనదేశంలో 1962-67 మధ్యకాలంలో చలామణిలో ఉన్న నోట్లతోపాటు టిప్పు సుల్తాన్ కాలంలో చలామణిలో ఉన్న నాణేలు, స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి చలామణిలో ఉన్న నాణేలు సేకరించారు.


వివిధ దేశాల కరెన్సీ, నాణేలు, పోస్టల్‌స్టాంపులను తిలకిస్తున్న గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు


టిప్పుసుల్తాన్ కాలం నాటి నాణేలు


1962-68 మధ్య చలామణిలో ఉన్న రూ. 10 నోటు

పాఠశాలల్లో ప్రదర్శన

కరెన్సీ రూపాంతరం చెందిన విధానం గురించి విద్యార్థులకు అవగాహనకల్పించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. వివిధదేశాల కరెన్సీ, పోస్టల్ స్టాంపులు, కవర్లు గురించి వివరించడంతో పాటు తాను ఎలా సేకరించానో చెప్పడం ద్వారా వారిలోనూ దీనిపై ఆసక్తి కలిగించాలని ప్రయత్నిస్తున్నారు. గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనను విద్యార్థినులు ఆసక్తిగా తిలకించారు.


వివిధ దేశాల పోస్టల్ స్టాంప్లు, కవర్లు

చిన్ననాటి నుంచే ఆసక్తి కలిగింది

- ఏఎం చంద్రశేఖర్, పవర్‌ప్లాంటు ఉద్యోగి, పిఠాపురం



చిన్నతనంలో ఎవరైనా బంధువులు వచ్చినా, ఇతర ప్రాంతాలకు వెళ్లినా నాణేలు, కరెన్సీ నోట్లు ఇచ్చేవారు. పలువురు దగ్గర వివిధ రకాల కరెన్సీ నోట్లుచూసి వాటిని సేకరించాలనే ఆసక్తి కలిగింది. 2006 నుంచి ఇలా సేకరణ ప్రారంభించి 65 దేశాల కరెన్సీ, 50 దేశాల పోస్టల్ స్టాంపులు సేకరించాను. ఇప్పటికి ఎక్కడికి వెళ్లినా, ఇతర దేశాల్లో ఉన్న స్నేహితులతో మాట్లాడినా వారి వద్ద ఉన్న వైవిధ్యమైన కరెన్సీ కవర్లు గురించి అడుగుతాను. వాటిని ఇమ్మని అడిగి భద్రపరుస్తాను. ఉద్యోగం చేస్తున్న నేను సెలవులకు వచ్చినప్పుడు ప్రభు త్వ పాఠశాలల్లో ప్రదర్శనలు ఏర్పాటుచేసి వాటి ని విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నాను. ఇది ఎంతో శ్రమ, వ్యయంతో కూడుకున్న పని అయినా అందులో ఉన్న సంతృప్తి ఇంకా కొనసాగించేలా చేస్తోంది.

పెట్రోలు లూజు అమ్మకాలు కాదండోయ్

- వీధికుక్కల బెడద నుంచి బయట పడేందుకు..
- ప్రతీ ఇంటి ముందు వేలాడుతున్న బాటిళ్లు


అమలాపురం కామాక్షీ పీఠం వీధిలో ఇంటి కిటికీలకు వేలాడుతున్న ఎరుపురంగు ఫుడ్‌కలర్ కలిసిన నీళ్ల బాటిళ్లు



అమలాపురంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని ప్రధాన వీధుల్లో పెట్రోలు లూజు అమ్మకాలు పెరిగిపోయాయా. జిల్లాలో ఎక్కడపడితే అక్కడ పెట్రోలు లూజు అమ్మకాలు విచ్చలవిడిగా జరిగిపోతున్నాయా. లూజు పెట్రోలు కోసం ఎందరో వాహనదారులు ఆయా ఇళ్ల వద్ద వాహనాలు ఆపి పెట్రోలు అడగడం నిజం కాదా. అవి పెట్రోలు లూజుకు అమ్మకాల బాటిళ్లు కాకపోతే మరేమిటి అని ఎవరికైనా సందేహం వస్తోంది. పెట్రోలు లూజు అమ్మకాల మాదిరిగానే ఇళ్ల ప్రహరీ గోడలపైనా కిటికీలకు వేలాడుతున్న ఆ ప్లాస్టిక్ బాటిళ్లు ఏమిటో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగక మానదు. వీధి కుక్కల బెడద నుంచి బయట పడేందుకు ఇళ్ల యజమానులే కాదు వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు ఈ తరహాలో ఎరుపురంగు ఫుడ్ కలర్ కలిపిన నీరున్న బాటిళ్లను వేలాడ దీస్తున్నారంటే కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదేదో అమలాపురం పట్టణానికి మాత్రమే పరిమితమనుకుంటే పొరపాటే. అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి, పేరూరు, అంబాజీపేట, ఇలా ఎక్కడపడితే అక్కడ ఇళ్ల చుట్టూ ఎరుపురంగు నీళ్ల బాటిళ్లు రోడ్ల పక్కన దర్శనమిస్తున్నాయి.

దేశ అత్యున్నత న్యాయస్థానం కల్పించుకున్నా..

దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో వీధి కుక్కల బెడద ఒకటి. అందుకే దేశ అత్యున్నత న్యాయస్థానం కల్పించుకుని మరీ ప్రత్యేక ఆదేశాలను జారీ చేసింది. కొవిడ్ సమయంలో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీధికుక్కల బెడదను నియంత్రించేందుకు ప్రభుత్వపరంగా ఇప్పటికే ప్రాథమిక చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంతోపాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేస్తున్నారు. కానీ ఈ పనులు మందకొడిగానే జరుగుతున్నాయి. రేబిస్ సోకిన కుక్కలతోపాటు దాడులకు తెగబడి ప్రమాదకరమైన కుక్కలను ప్రత్యేక షెల్టర్లకు తరలించాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం సైతం ప్రత్యేక ఆదేశాలు ఇచ్చింది. అందుకు తగ్గ ఏర్పాట్లు ఎక్కడా చేపట్టలేదు. వీధి కుక్కల నియంత్రణ పట్టణాలకే పరిమితం కావడంతో గ్రామాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. మరి వీటిని ఎప్పటికి నియంత్రించనున్నారు. అందుకేనేమో కుక్కల బెడద నుంచి బయటపడేందుకు ఎరుపురంగు కలిపిన నీరున్న ప్లాస్టిక్ బాటిళ్లను వేలాడదీయడం పల్లెసీమల నుంచే ప్రారంభమైంది. ఈ బాటిళ్లను వేలాడదీయడంవల్ల కుక్కల బెడద చాలా వరకు తగ్గిందని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు.

కుక్కలకు ఎరుపురంగు ఫోబియా ఉండవచ్చు

- డాక్టర్ ఎల్.వియారెడ్డి, అమలాపురం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు



కుక్కల బెడద నుంచి బయట పడేందుకు ఎరుపురంగు కలిపిన నీరున్న బాటిళ్లు పలు ప్రాంతాల్లో చూస్తున్నాం. ఎరుపురంగు అంటే కుక్కలకు ఫోబియా ఉండొచ్చు. ఎందుకంటే మరీ ఏ ఇతర రంగు కలిపిన నీటిని ఎవరూ వాడడం లేదు. ఇది మూఢనమ్మకమని కొట్టి పారేయలేము. ఎరుపురంగు బాటిళ్లను చూసి కుక్కలు దరిదాపులకు రావడం లేదని ఇప్పటికే చాలామంది చెప్పారు.

డాక్టర్ అర్చనకు ఉత్తమ సేవా పురస్కారం



జీజీహెచ్(కాకినాడ), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గొల్లలమామిడాడరూరల్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శివకోటి అర్చనకు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కారం వరించింది. 2017సెప్టెంబరు నుంచి 2025 జూన్ మధ్య కాకినాడ జీజీహెచ్‌లోని ఫ్యామిలీ ప్లానింగ్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నప్పుడు 3,918 మంది గర్భిణులకు ట్యూబెక్టమీ ఆపరేషన్‌లు చేశారు. వారిలో 75 మంది హెచ్‌ఐవీ గర్భిణులకు కూడా ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఆమె అందించిన ఈ సేవలను ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీస్యాక్స్) గుర్తించి అవార్డును ప్రదానం చేయనుంది. డిసెంబరు 1వ తేదీన ఎయిడ్స్ డే సందర్భంగా డాక్టర్ అర్చన విజయవాడలో ఈ అవార్డ్‌ను అందుకోనున్నారు. ఈమెను ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


స్వామివారి నిత్యాన్నదానికి రూ.లక్ష విరాళం అందిస్తున్న రుద్రరాజు గంగరాజు

అంతర్వేది, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం అనంతరం నిత్యాన్నదాన ట్రస్టుకు మలికిపురం మండలం లక్కవరానికి చెందిన రుద్రరాజు గంగరాజు సోదరి రుద్రరాజు సుభద్రాయమ్మ జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళంగా అందించారు. విరాళ దాతకు ఆలయ ఏసీ ఎంకేటీఎస్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

గ్రామాల్లో పీఎంపీ, ఆర్‌ఎంపీలు కీలకం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

- రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

రాజానగరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పీఎంపీ, ఆర్‌ఎంపీల సేవలు కీలకమని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఏపీ జేఏసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వైద్యుల పాత్ర అనే అంశం రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆమె విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందుతున్నాయంటే గ్రామీణ వైద్యుల వల్లేనని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఆరోగ్య సంరక్షణలో వైద్యసేవలు అందించేది వారేనని అన్నారు. గ్రామీణ వైద్యుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు.ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఎప్పటికప్పుడు అనుభవజ్ఞులైన వైద్యుల వద్ద వైద్యరంగంలో వస్తున్న ఆధునిక విధానాలను తెలుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీలు గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో పీఎంపీ, ఆర్‌ఎంపీలు పాల్గొని ప్రజల్ని జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు పేదల పాలిట దైవాలని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కేజీ గోవిందరెడ్డి, జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, జేఏసీ గౌరవాధ్యక్షుడు జనార్దన్, జీఎస్ఎల్ క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ తరుణ్, జేఏసీ గౌరవ సలహాదారు లంక ప్రసాదరావు, అడ్వైజర్ ఎస్ఎల్ రావు, రాష్ట్ర నాయకులు కంబాల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన


మహాసంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభులు

- పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

పిఠాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న దత్త జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగం గా రెండో రోజు శనివారం ప్రత్యేక పూజ లు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రుత్విక్‌లు కార్యక్రమాలు జరిపించారు. అంతకు ముందు మహా గణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభులకు ఏకాదశి శతరుద్రాభిషేకం, సహస్ర నామార్చన, రుత్విక్కులతో దత్త మూలమంత్ర అనుష్టానం, అగ్నిప్రతిష్టాపన, దత్తమంత్ర హోమం, వివిధ హారతులు. స్వామికి పల్లకిసేవ నిర్వహించారు. పూజాది కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య పాల్గొన్నారు.


శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న రుత్విక్‌లు

దత్తాత్రేయుడి సహస్ర తామర పుష్పార్చన

పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయస్వామి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శనివారం సహస్ర తామర పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం పుష్పార్చన అనంతరం పుష్పాలతో దత్తాత్రేయస్వామిని అలంకరించారు. ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్‌వరణాలు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, రుత్విక్‌లతో దత్తమాల మంత్ర అనుష్టానం, అగ్నిప్రతిష్టాపన, దత్తమూల మంత్రహోమాలు, మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నెట్‌బాల్ పోటీలకు జట్లు ఎంపిక

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే నెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడే అండర్-14 బాలురు, బాలికల జట్టును శనివారం ఎంపిక చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో పరిశీలకురాలు కల్పన, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు సునీత, మల్లేశ్వరరావు, పీడీలు చిట్టిబాబు, ఖుద్దూస్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగాయి.

బాలికల జటు: బి.భాగ్యశ్రీ (విశాఖపట్నం), ఎన్.వెంకట నాగభవానీ ఈక్షిత (విశాఖపట్నం), పల్లి శ్రీగాయత్రి (విశాఖపట్నం), పెచ్చెట్టి బిందుశ్రీ మంజు (పశ్చిమగోదావరి), పి.వ సుంధర (పశ్చిమగోదావరి), యండమూరి హన్నా (కృష్ణా), సీహెచ్. విద్యాలక్ష్మి (తూర్పుగోదావరి), ఎం.ప్రణీత (కడప), ఎంకే కీర్తిక (చిత్తూరు), ఎం.అమూల్య (గుంటూరు), డి.మెహరీన్ (నెల్లూరు), జి.తేజశ్రీ (పశ్చిమ గోదావరి).

బాలుర జట్టు: కె.సోహిల్ (విశాఖపట్నం), ఎం.ధనుష్ మణికంఠ(విశాఖపట్నం), పి.చందు వెంకట నిఖిల్ (విశాఖపట్నం), ఎం.వెంకట శ్రీనివాస్ కుమార్ (తూర్పు గోదావరి), కె.సృజన్ (తూర్పు గోదావరి), కె.ఆంటోని (పశ్చిమ గోదావరి), బి.లోకేష్ (కృష్ణా), వి.డిల్లీబాబు (నెల్లూరు), కేపే బాలు (గుంటూరు), ఆర్.అజయ్‌కుమార్ (విజయనగరం), టీజే శేషాద్రి (చిత్తూరు), వి.గౌతమ్‌బుద్ధ (పశ్చిమ గోదావరి).


రాష్ట్ర పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

శ్రీనివాస.. గోవిందా..


అలంకార రూపంలో వేంకటేశ్వరస్వామి

- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు
- భారీ లైన్లలో స్వామివారి దర్శనం

ఆత్రేయపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్ల స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.56.59 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే స్వామివారి అన్నప్రసాద ట్రస్టుకు విజయవాడకు చెందిన లేల్లపల్లి నారాయణ- రేవతి దంపతులు రూ.1,00,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలను ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు అందించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం మహిళలకు రాష్ట్రమంతా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం కల్పించడంతో దేవాలయాలు కళకళలాడుతున్నాయి. వాడపల్లి వెంకన్న ఆలయానికి పలు చోట్ల నుంచి మహిళలు వచ్చారు. అలాగే వాడపల్లి కొత్త వంతెన నుంచి ఉచిత బ్యాటరీ వాహనాల్లోను మహిళలు గోవిందుడి ఆలయానికి వస్తున్నారు.


వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

నేటి నుంచి తిరునక్షత్ర ఉత్సవాలు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఆళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఆళ్వార్ సన్నిధిలో ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబరు 4 వరకూ ఈ ఉత్సవాలు జరుగుతాయని ఉపకమిషనరు సూర్యచక్రధరరావు తెలిపారు. ప్రతి రోజు సేవాకాలం, ద్రవిడ వేద పారాయణం, పల్లకి సేవా మహోత్సవం, నివేదన, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆళ్వార్ల సన్నిధి

విద్యార్థి వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మహాసభలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ కన్వీనర్ రామకృష్ణ

- పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను సమరశీల పోరాటాలతో తిప్పికొట్టాలని పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల్లో భాగంగా రెండో రోజైన శనివారం జరిగిన కార్యక్రమానికి రామకృష్ణ విచ్చేసి మాట్లాడారు. విద్యారంగంలో అశాస్త్రీయ భావజాలాన్ని, మనువాద విధానాలను జొప్పిస్తున్నారని, యూనివర్శిటీలను మతోన్మాద కేంద్రాలుగా మారుస్తూ ప్రగతి శీల శక్తులపై దాడులకు ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. పాఠశాల నుంచి యూనివర్శిటీ వరకూ విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. పాలకులు మాటల్లోనే తప్ప ఆచరణలో విద్యార్థుల గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ పీడీఎస్‌యూ కార్యక్రమాల రాష్ట్ర ఉద్యమ నిర్మాణ సమీక్షను ప్రవేశపెట్టారు. నాయకులు రఫీ, భాను ప్రసాద్, సిద్దు, రూపా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం వాసికి నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు



న్యూఢిల్లీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం గ్రామానికి చెందిన వైకుంఠరావుకు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు -2025 దక్కింది. శనివారం న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి రాందాస్ అథవాలే చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశంలో స్వేచ్ఛ, సమానత్వం కోసం పాటుపడే వారికి అంబేడ్కర్ గ్లోబల్ ఫౌండేషన్ అవార్డులు ప్రకటించింది. వైకుంఠరావు 'గాస్పల్ మినిస్ట్రీస్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు, రాకడ వారి వృద్ధాశ్రమం నెలకొల్పి అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పించినందుకు ఈ అవార్డును అందించింది.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజమహేంద్రవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుగనుంది. వీసీ ఆచార్య మునిరత్నం నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమ్మేళనంలో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బొమ్మూరు తెలుగు సాహిత్య పీఠం పూర్వ పీఠాధిపతి, కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య కడప రమణయ్య తదితరులు హాజరుకానున్నారు.



ఎటుచూసినా మంచు!





చలికాలం వచ్చేసింది.. తెల్లారేసరికి పొగ మంచు కమ్మేస్తుంది. ఎటుచూసినా మంచే కనిపిస్తుంది. రాజమహేంద్రవరంలో రహదారితో పాటు రైల్వే బ్రిడ్జిపై మంచుతెర దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా...

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాజమహేంద్రవరం

మేమూ ఆడేస్తాం..

అమలాపురంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు







చెస్, వాలీబాల్, క్యారమ్స్ ఆడుతున్న దివ్యాంగులు

అమలాపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కళ్లు లేవని కలత చెందలేదు. కాళ్లు లేవని వెనుకడుగు వేయలేదు. దివ్యాంగులు ఎందులోను తక్కువ కాదని నిరూపిస్తూ ముందడగు వేశారు. డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి రుద్ర వైకుంఠరావు పర్యవేక్షణలో దివ్యాంగులకు పలు క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ ఎవై శ్రీనివాస్, సూపరింటెండెంట్ యు.రాజు సహకారంతో పోటీలను నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు సకలాంగులకు దీటుగా క్రీడల్లో రాణించి సత్తా చాటాలని వైకుంఠరావు సూచించారు. విభిన్న ప్రతిభావంతుల్లో మనోధైర్యం పెంచేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ క్రీడా పోటీలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 300మందికి పైగా దివ్యాంగ క్రీడాకారులు పాల్గొన్నారు. బ్యాడ్మింటన్ పోటీలు 3 విభాగాల్లో నిర్వహించారు. చెస్, క్యారమ్స్, వాలీబాల్ పోటీలు జరిగాయి. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్, డెఫ్ అండ్ డెమ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, సమాఖ్య అధ్యక్షుడు కొనసన సత్యసుబ్రహ్మణ్యం, జిల్లా సభ్యులు జె.పరంకుశం, నల్లా నాయుడు ఉన్నారు.

అంతా ఆన్‌లైన్..

- సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌలభ్యం కోసం అన్నిసేవలు, ప్రసాదాలకు ఆన్‌లైన్ సౌకర్యం
- ఏపీటెంపుల్స్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ లేదా మనమిత్ర వాట్సాప్ 9552300009 ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే అవకాశం
- ఈవో వీర్ల సుబ్బారావు

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తులు గంటలతరబడి క్యూలైన్‌లలో నిరీక్షణ లేకుండా సేవలన్నింటికీ ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. వ్రతం టిక్కెట్లు, వసతిగదులు, దర్శనాలు, ప్రసాదాల కొనుగోలు వీటన్నింటికీ ప్రభుత్వ ఆదేశాలు, దేవదాయశాఖ సూచనలతో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. భక్తులు ఆన్‌లైన్ టిక్కెట్లను ఏపీటెంపుల్స్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ లేదా మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009 ద్వారా బుక్‌చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా గోశాల, అన్నదానట్రస్టులకు విరాళాలు అన్ని క్రెడిట్, డెబిట్ కార్డులు, అన్నిరకాలైన యూపీఐ పేమెంట్ల ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఎటువంటి నిరీక్షణ లేకుండా సంతృప్తిగా దర్శనం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ భక్తుడు సద్వినియోగం చేసుకోవాలని ఈవో సుబ్బారావు కోరారు



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు సేవయిన ప్రాకారసేవ శనివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మేళతాలాలతో తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పు రాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణలు గావించారు. అనంతరం హారతులిచ్చి స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

కుక్కకు మత్తు మందిచ్చి..

ఇంట్లో చోరీ

ల్యాప్‌టాప్, కారుతో పరారీ

కాజులూరు(కరప), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో కాజులూరు మండలం గొల్లపాలెంలోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. మరమ్మతులు (రెనొవేషన్) చేస్తున్న ఇంటి గేటు బద్దలు కొట్టి పెంపుడు కుక్కకు మత్తు మందు ఇచ్చి తలుపులు పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న ల్యాప్‌టాప్, కారు కీస్ తీసుకుని కారుతో సహా పరారయ్యారు. ఇంటి యజమాని భగవాన్ గొల్లపాలెం పోలీసుకు ఫిర్యాదు చేశాడు. గొల్లపాలెం ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్, క్లూస్‌టీమ్ సీఐ పి.శ్రీనివాసులు బృందంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మత్తు మందు ఇచ్చిన పెంపుడు కుక్కను వెటర్నరీ వైద్యులు పరీక్షించారు. భగవాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వాడపల్లి ఆలయంలో భక్తురాలి నెక్లెస్ చోరీ

ఆత్రేయపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఓ మహిళ 20 గ్రాముల బంగారం నెక్లెస్ చోరీకి గురైంది. హైదరాబాద్‌కు చెందిన పున్నపు శివ లక్ష్మి శనివారం వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చింది. ఆలయంలో ప్రదక్షిణ చేస్తుండగా ఆమె పర్సును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పర్సులో 20 గ్రాముల బంగారు నెక్లెస్ ఉన్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ ఎస్.రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలు దొరికారు..

- వేర్వేరు చోరీ కేసుల్లో 12 మంది అరెస్ట్
- రూ.59.60 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- వెల్లడించిన ఎస్పీ బిందుమాధవ్





వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ ఎస్పీ బిందుమాదవ్, నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కాకినాడ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన పలు చోరీ కేసుల్లో 12 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ.59.60 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఈ వివరాలను వెల్లడించారు.

కేసుల వివరాలివి...

ఇటీవల రద్దీగా ఉండే బస్‌స్టాండ్‌లు, బస్‌స్టాప్‌లలో మహిళలే టార్గెట్‌గా హ్యాండ్‌బ్యాగ్‌లలోని విలువైన వస్తువులను అగంతకులు తస్కరిస్తుండడం పోలీసులకు చాలెంజ్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో పెద్దాపురం ఎస్‌డీపీవో డి.శ్రీహరిరాజు నేతృత్వంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. తాడేపల్లిగూడెం, యాగరిపల్లి కాలవగట్టుకు చెందిన పాత నేరస్తురాలు 27 ఏళ్ల గేరక వరలక్ష్మి.. ఆమెకు సహకరించిన అదే ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల మరసాని సత్యవేణిని అదుపులోకి తీసుకుని విచారించారు. వరలక్ష్మిపై గతంలో సఖినేటిపల్లిలో 2, నూజివీడులో 2, ఏలూరులో 1, తాళ్ళపూడిలో 1 పాత కేసులు ఉన్నట్టు ఎస్పీ వెల్లడించారు. వారి నుంచి జగ్గంపేట, తుని, గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 4 కేసులకు సంబంధించిన 176 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులోని సురేష్ జ్యూయలరీ షాపులో ఈ ఏడాది సెప్టెంబరు 24న అర్ధరాత్రి షాపు షట్టర్ పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 11 కిలోల వెండి వస్తువులను దొంగిలించుకునిపోయారు. దీనిపై ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు పర్యవేక్షణలో ఎస్‌ఐ లక్ష్మీకాంతం బృందాలతో దర్యాప్తు చేపట్టి మధ్యప్రదేశ్‌కు చెందిన డెకాయిట్ ముఠా సభ్యులైన షేక్ ఫక్రుద్దీన్ బిషనై, కేషూమెహదా, బారిక్‌సింగ్, రఘాన్ హాటియా, హీరు, మోహర్ కల్లు మెహదాను అరెస్ట్ చేసి 11 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, నెల్లూరుకి చెందిన ఇద్దరు నేరస్తులు అరెస్ట్ కావల్సి ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే అన్నవరం, గాయిత్రి కోలని మెట్టకు చెందిన గుత్తిన పవనహరి ప్రసాద్ ఇంటిలో సెప్టెంబరు 4న రాత్రి దొంగలు పడి దోచుకెళ్లారు. ప్రత్తిపాడు, అన్నవరం పోలీసులు ఈ కేసును చేధించి విశాఖపట్నం భీమిలి, చేపల ఉప్పాడకు చెందిన 38 ఏళ్ల చిన్నమాన ఎల్లాజీ అలియాస్ రాజును అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. ఈ కీలకమైన కేసులను చేధించిన ప్రత్తిపాడు ఎస్‌ఐ లక్ష్మీకాంతం, అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు, అడిషనల్ ఎస్‌ఐ ఎల్.ప్రసాద్, ప్రత్తిపాడు, అన్నవరం పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ కెవి.సత్యనారాయణ, పెద్దాపురం ఎస్‌డీపీవో డి.శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అంబాజీపేట విద్యార్థిని



మౌనికను అభినందిస్తున్న దృశ్యం

అంబాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని మీసాల మౌనిక స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం సాయిరాం, పీడీ కె.ఆదిలక్ష్మి తెలిపారు. జనవరిలో రాజస్థాన్ బర్మర్ పట్టణంలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీల్లో అండర్-19 జట్టులో మౌనిక పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మౌనికను ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, ఎమ్.ప్రకాష్, ఉపాధ్యాయుడు బీ.మూర్తి, పీఈటీలు ఉమామహేశ్వరరావు, సూర్యకుమారి అభినందించారు.

సాఫ్ట్‌బాల్ జట్టులో జి.వేమవరం విద్యార్థులు

ఐ.పోలవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ సాఫ్ట్‌బాల్ జట్టులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం జడ్పీ హైస్కూల్ క్రీడాకారులకు స్థానం లభించింది. కడప జిల్లా పులివెందులలో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలబాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఐదుగురు విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగం నుంచి మద్దింశెట్టి వీరవెంకటబాలాదిత్య, కర్రి కాసువర్మ, బాలికల విభాగం నుంచి మందపల్లి ఝాన్సీశ్రీ, పులుసుగంటి కృష్ణదీపిక, చింతా రమ్యశ్రీ ఎంపికయ్యారు. వారు జనవరి 17 నుంచి 21వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారు. విద్యార్థులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, సర్పంచ్‌లు నల్ల సుదర్శన్‌రావు, లంకలపల్లి దుర్గాదేవీ మునిరాజు, సొసైటీ అధ్యక్షులు పెంట రవిప్రసాద్, చిక్కాల శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు చోడిశెట్టి నాగబాబు, చోడిశెట్టి బ్రహ్మానందం తదితరులు అభినందించారు.

యానాంలో భారీగా గుట్కా పట్టివేత

- రూ.4 లక్షల విలువైన ప్యాకెట్ల స్వాధీనం
- వ్యక్తి అరెస్ట్



గుట్కా ప్యాకెట్లు, నిందితుడితో యానాం పోలీసులు

యానాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యానాం బైపాస్ 3తూములు సెంటర్లో రూ.4 లక్షల విలువైన 500 కిలోల నిషేధిత గుట్కా ప్యాకెట్లను యానాం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ సురుకుల పంపిణీ వినియోగించిన టాటా ఏసీ వాహనంలో అక్రమంగా గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్నట్టు గుర్తించారు. యానాం పరిధిలో అమ్మేందుకు విశాఖపట్నం నుంచి వాహనంలో తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. గుట్కా తరలిస్తున్న కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన డ్రైవర్ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. భారీమొత్తంలో గుట్కా ప్యాకెట్లు లభ్యమ య్యాయని ఎస్పీ వరదరాజన్ తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా పట్టుకున్న గుట్కా పట్టుకున్న ఎస్‌ఐ పునిత్‌రాజా, బీట్ సిబ్బంది యేసురాజు, యేసుబాబు, హోంగార్డు శివశంకర్, సురేష్‌ను అభినందించారు. దీనిపై కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి

మరో యువకుడికి తీవ్రగాయాలు

ప్రత్తిపాడు-లంపకలోవ ఆర్‌అండ్‌బీ రహదారిపై ఘటన



ప్రమాదంలో మృతిచెందిన రాంబాబు



గాయపడిన యువకుడు దుర్గాప్రసాద్

ప్రత్తిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు-లంపకలోవ ఆర్‌అండ్‌బీ రహదారిపై శనివారం రాత్రి విద్యుత్ స్తంభాన్ని మోటార్‌సైకిల్ ఢీ కొన్న ఘటనలో యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలంలోని రౌతుపాలెం గ్రామానికి చెందిన ఇంటి రాంబాబు (32) మరో యువకుడు దుర్గాప్రసాద్‌తో కలిసి శనివారం రాత్రి ప్రత్తిపాడు నుంచి రౌతుపాలెం మోటార్‌బైక్‌పై వెళ్తుండగా లంపకలోవ ఇటుకబట్టీల ప్రదేశం వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ లైటింగ్‌కు కంగారుపడి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న ఇంటి రాంబాబు, దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారికి స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అయితే ఇంటి రాంబాబు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జుఅయిన మోటార్‌సైకిల్

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్



ఆకట్టుకున్న ఎన్‌సీసీ విద్యార్థుల విన్యాసాలు

తుని రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని 18వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మొహ్మద్ ఆసిఫ్ అన్నారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఆసిఫ్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో క్రమశిక్షణ ఉంటుందని, విద్యార్థులు లక్ష్యం చేరే వరకు విశ్రమించకూడదన్నారు. ఎన్‌సీసీ ద్వారా ఉజ్వల భవిష్యత్‌ను దేశ రక్షణ, సమగ్రతకు వినియోగించాలని కోరారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాస్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ఎన్‌సీసీతో అలవడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్.భానుమూర్తి పాల్గొన్నారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రదర్శించిన కవాతులు, విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అంగన్‌వాడీ కార్యకర్తకు పాముకాటు

గొల్లప్రోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో విధుల్లో ఉన్న కార్యకర్తను పాము కాటు వేయడంతో చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు డాక్టర్ మలిరెడ్డి వెంకట్రాజు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 3 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో నెంబరు 2 కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌గా ఉన్న కోన లోవకుమారి విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో పాము కాటు వేసింది. సహచర అంగన్‌వాడీ వర్కర్లు, బంధువులు ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం కాకినాడకు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

ఘనంగా భవానీల కలశ పూజ

అంతర్వేది, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెంలో శనివారం మారెమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళంపల్లి గద గురుభవానీ ఆధ్వర్యంలో భవానీలు 18కలశ పూజా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, పడిహారతి విశేషంగా జరిగాయి. శ్రీజ్యోతిస్వరూప అయ్యప్ప భజన సమాజం ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు.

13న మాలల ఆత్మీయ సమారాధన



అమలాపురంలో జరిగిన జిల్లాస్థాయి మాలనాయకుల సమావేశంలో సంఘీభావం

అమలాపురంటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):రాజకీయాలకు అతీతంగా ఐక్యతను చాటుతూ డిసెంబరు13న జిల్లాస్థాయిలో మాలల ఆత్మీయ సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు డీబీ లోక్, ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబూరావు తెలిపారు. అమలాపురం ఎర్రవంతెన వద్ద శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాలజాతి ఐక్యతతో పాటు అభివృద్ధికి బాటలు వేసేలా ఆత్మీయ సమారాధన నిర్వహిస్తామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ల అయినా మాలలు ఇంకా అన్ని రంగాల్లోను వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మాలలు నీలిరంగు జెండాలు భుజాన వేసుకుని అమలాపురంవైపు తరలిరావాలని గొల్లపల్లి డేవిడ్, చెల్లి అశోక్, కోట రామ్మోహనరావు పిలుపునిచ్చారు. భట్నవిల్లినుంచి పేరూరు వై.జంక్షన్‌కు వెళ్లే హైవే బైపాస్ రోడ్డులో మాలల ఆత్మీక సమారాధన నిర్వహిస్తామని నాయకులు ప్రకటించారు. వివిధమండలాలకు చెందిన నాయకులు రేవు తిరుపతిరావు, దేవరపల్లి శాంతి కుమార్, నక్కా సంపత్‌కుమార్, గూటంసాయి, కప్పల శ్రీధర్, నల్లా నరసింహమూర్తి, జల్లి శ్రీను, నాతి శ్రీను, పినిపే జయరాజు, నెల్లి లక్ష్మీపతి, పెనుమాల చిట్టిబాబు, గెడ్డం సురేష్‌బాబు, బొంతు బాలరాజు, ఉండ్రు బాబ్జి, పెయ్యల శ్రీనివాస్, పెయ్యల పరశురాముడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజేశ్వరి

అమలాపురం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో ఆదివారం సెలవు రోజున యథావిధిగా విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు పనిచేస్తాయని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.రాజేశ్వరి తెలిపారు. జిల్లాలో విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆమె కోరారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఏపీఈపీడీసీఎల్, సెక్షన్ ఆఫీస్ కౌంటర్లు, ఏపీపీ సెంటర్లలో కూడా ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని ఆమె తెలిపారు.

ప్రధాన మలుపుల వద్ద ప్రమాదకరంగా ....

- రోడ్ల పక్కన మొక్కలతో ఇబ్బందులు
- రోడ్డు బెర్మ్‌లను మూసేస్తున్న వైనం
- అధికారులు పట్టించుకోవాలని వినతి





లంకలగన్నవరం వద్ద, మొండెపులంక లాకు వద్ద మలుపులో ప్రమాదకరంగా మొక్కలు

పి.గన్నవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డుకు ఇరువైపులా మొక్కలు వేపుగా పెరిగి రోడ్డునుమూసివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజవరం- పొదలాడ రహదారిలో పలు చోట్ల మొక్కలు వేపుగా పెరిగి ప్రధాన రహదారి చెంతనే బెర్మ్‌లను మూసివేసి రోడ్డుపైకి వచ్చేశాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు మలుపుల్లో కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతుయన్నాయని వాహనదారులు వాపోతున్నారు. రాజవరం-పొదలాడ రహదారిలో లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, పలు గ్రామాల్లో ప్రధాన రహదారిపైకి మొక్కలు వచ్చాయి. ఒక సీజన్‌లో రహదారులు, కాల్వలు చెంతనే పెరిగిపోయిన మొక్కలను ఉపాధిహామీ కూలీలు తూతూమంత్రంగా తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. కొంతకాలంగా మొక్కలు బాగా పెరిగి రోడ్డును మూసేసినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కొన్నిచోట్ల రోడ్డు చెంతనే బెర్మ్ లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు బాగా పెరిగి పోవడంతో బెర్మలు కనపించడం లేదు.రోడ్లను మూసేస్తున్న మొక్క లను పూర్తిగా తొలగించి ప్రమాదాలను అరిక ట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు





స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. తొలి హారతిని స్వీకరించి భక్తులు తన్మయత్వం చెందారు. మార్గశిరమాసం శుద్ధనవమి కావడంతో దేవస్థానం భక్తులతో పోటెత్తింది. వేకువజామునే వైనతేయ నదిలో స్నానమాచరించి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. శనివారం సందర్భంగా అర్చకులు వివిధ రకాల పుష్పాలతో స్వామి-అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.2,72,239 ఆదాయం వచ్చింది. స్వామివారిని 5వేల మంది దర్శించుకుని నిత్యాన్నదానంలో 2800 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

చేయని పనులు చేశానని చెప్పుకోవడం నా జీవితంలో లేదు

- ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి

యానాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తాను చేయని పనులను, చేశానని చెప్పుకోవడం తన చరిత్రలో లేదని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రత్యక్షంగా నష్టం లేకపోయినప్పటికి పరోక్షంగా ఉపాధి కోల్పోయిన యానాంలోని 16,500 కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రి, గవర్నర్, అధికారులను కోరానన్నారు. అయితే అధికారులు నివేదిక ప్రకారం రైతులకు, మత్స్యకారులకు పరిహారం ఇస్తామని ఉన్నతాధికారులు చెప్పారని మల్లాడి తెలిపారు. అయితే ఇది తుఫాన్ కావడంతో అందరికి నష్ట పరిహారం ఇవ్వాలని కోరానన్నారు. యానానికి సంబంధించి పలు కేంద్ర ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలతో త్వరలో పుదుచ్చేరి వెళ్లడం అనంతరం, ఢిల్లీ వెళ్తానన్నారు. అలాగే పచ్చే పుష్కరాలకు భారత ప్రభుత్వ పర్యాటకశాఖ నుంచి నిధులు విడుదల చేయాలని ఇప్పటికే కోరామన్నారు. దీని కోసం పుదుచ్చేరి నుంచి నివేదికతో ఢిల్లీ వెళ్తామన్నారు. అయితే ఇటువంటి అభివృద్ధి పనుల్లో ఏ ప్రయత్నం చేయని స్థానిక ప్రజాప్రతినిధి ఆయనే చేసినట్టు చెప్పుకోవడం చాలా హాస్యాస్పదంగా ఉందని మల్లాడి అన్నారు.

కార్యదర్శిగా రాజమోహన్ సేవలు ఆదర్శనీయం

అల్లవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అల్లవరం పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజమోహన్ డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొంది బదిలీఅయ్యారు. అల్లవరం పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామ సర్పంచ్ బొమ్మి బాలవేణి అధ్యక్షతన రాజమోహన్‌ను సన్మానించి ఆయన సేవలు కొనియాడారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, కొనుకు బాపూజీ, ఎంపీటీసీలు చికిలే లిల్లీ, ఎస్.మౌనిక వరలక్ష్మి, సభ్యులు ఎంఎస్ఆర్వీ సత్యనారాయణ, దాసం రాంబాబు, కంకిపాటి వీరబాబు, చీకట్ల వెంకటేశ్వరరావు, సుంకర నాగరత్నకుమారి, బండిగుప్తాపు సత్తిబాబు, జేవీఆర్ నాయుడు, వెదుళ్లపల్లి సుబ్రహ్మణ్యం, కామన నాగేశ్వరరావు, విన్నా సత్యం, మెరికల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానులకు పూర్తి హక్కుల కల్పనకు చర్యలు



ఎ.వేమవరంలో భూముల సర్వే తీరును పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతిపాదిత 22ఏ భూముల పునఃసర్వే నిర్వహిస్తూ ఆక్రమణలు నిరోధించి నిజమైన హక్కుదారులకు హక్కులు సంక్రమింపచేయడం జరుగుతుందని ఆర్డీవో కె.మాధవి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎ.వేమవరంలో రెవెన్యూ సర్వే విభాగాలు సంయుక్తగా ప్రతిపాదిత 22ఏ భూములను క్షేత్రస్థాయిలో పునఃసర్వే నిర్వహిస్తున్నారు. ఈసర్వేను క్షేత్రస్థాయిలో ఆర్డీవో పరిశీలించి సర్వే బృందానికి సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాధవి మాట్లాడుతూ భూముల స్థితిగతులను ధ్రువీకరిస్తూ సమగ్ర నివేదికలు రూపొందిస్తున్నా మన్నారు. ఏ జాబితాలో ఉన్న భూములపై నిషేధాలు తొలగించి భూమి యజమానులకు పూర్తి హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రత్యేక బృందాలు నియమించి గ్రామసభలతో కలసి గ్రామస్థాయి భూముల పరిశీలన జరుపుతున్నామని ఆమె తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ప్రకారం భూముల రికార్డులను సరిగ్గా పరిశీలించి పక్కా సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సర్వే కార్యక్రమాల ప్రక్రియను పరిశీలించి పలుసూచనలు చేశారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు ప్రభాకర్, తహశీల్దార్ దివాకర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది

అమలాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన, ప్రేమ, సమానత్వం అనే విలువలను పెంపొందించేందుకు పీఎల్‌హెచ్ఐవీ కమ్యూనిటీ టార్గెట్ ఇన్ఫర్మేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర మాట్లాడుతూ సమాజానికి ఒక ముఖ్య సందేశాన్ని చేరవేయడానికి ఒక మనసుతో ఒక లక్ష్యంతో ఇక్కడ మనం ఉన్నాం. ఈ ర్యాలీ మనసును వెలిగించే కొవ్వొత్తి మాత్రమే కాదని, అవగాహన, ప్రేమ, సమానత్వం అనే విలువలను వెలుగొందించడంగా భావించాలని పేర్కొన్నారు. ఎయిడ్స్ వల్ల మృతిచెందిన వేలాది మంది ఆత్మలకు నివాళిగా ఈర్యాలీ నిలుస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీహెచ్‌వీ భరతలక్ష్మి, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ బుచ్చిబాబు, రాఘవేంద్రరావు, గంటా శ్రీనివాస్ పాల్గొన్నారు

డాక్టర్ ఆదిత్య కుమార్‌కు పీహెచ్‌డీ



పి.గన్నవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కె.ముంజవరానికి చెందిన డాక్టర్ ఆదిత్యకుమార్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) వచ్చింది. కాంగ్రెషన్ అవేర్ లొపవర్ ఆన్-చిప్ ప్రోటోకాల్స్ విత్ నెట్వర్క్ ఆన్ చిప్ అండ్ క్లౌడ్ సెక్యూరిటీ అనే పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. చెన్నైలో ఇస్రో కార్యదర్శి డాక్టర్ నారాయణన్, వెల్‌టెక్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రజత్‌గుప్తా నుంచి ఆయన పీహెచ్‌డీ పొందారు. నెట్‌వర్క్-ఆన్-చిప్(ఎన్ఓసీ) ఆకృతుల్లో మరియు క్లౌడ్ వాతావరణాలతో సమన్వయమైన భద్రత మరియు పనితీరును మెరుగుపరచడంలో ఆయన అందించిన సేవలకు డాక్టరేట్ వచ్చింది. ప్రస్తుతం ఆయన హైదరాబాదులోని ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి టవర్ లైన్స్ నిర్మాణం నిమిత్తం కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం అన్ని గ్రామాలకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రూ.30వేలు సహాయం

ఉప్పలగుప్తం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా పేలుడులో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స అనంతరం అమలాపురంలో ఇంటి వద్ద కోలుకుంటున్న తొమ్మిదవ వార్డుకు చెందిన కుంచే రణదీప్‌దాస్‌ను శనివారం గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. బాధితునికి రూ.30వేలు సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్, మాకే సిద్ధు, గూటం సాయి, గంటి చిరంజీవి పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

రాజోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు అన్నారు. శివకోడు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం విపాసన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ధ్యానంపై ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం చేయడం ద్వారా విద్యార్థుల ప్రవర్తనలో గణనీయమైన మార్పు కనిపిస్తుందన్నారు. విపాసర ఇంటర్నేషనల్ మెడిటేషన్ సంస్థ నుంచి వచ్చిన వలంటీర్లు ఎం.సరస్వతీదేవి, కె.మధుసూదన్‌రావు, ఎ.విజయ ధ్యానంపై అవగాహన కల్పించారు.

వృద్ధులు, వితంతువులకు రగ్గుల పంపిణీ

యానాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్త తోట రాజుశనివారం ఫరంపేట, ఆడపడుచు కాలనీల్లో 200మంది వృద్ధులు, వితంతువులకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోతుల శివకృష్ణ, నందిక భాస్కర్‌శ్రీనివాస్, మున్న, పేర్రాజు, బాబీ, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అందరికీ సంక్షేమ లబ్ధి



మాట్లాడుతున్న అబ్జర్వర్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్

ఉప్పలగుప్తం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ సంక్షేమ లబ్ధి అందుతోందని సెంట్రల్ డెల్టా వాటర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. భీమనపల్లిలో శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో టీడీపీ బలహీనంగా ఉన్న బూత్‌ల పై సమీక్ష నిర్వహించారు. సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం తీసుకున్న చర్యలను శ్రీనివాస్ వివరించారు. సంక్షేమం అమలు చేస్తూనే గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లను అభివృద్ధి చేస్తున్న తీరును ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. టీడీపీ బలహీనంగా ఉన్న బూత్‌ల్లో ఓటు శాతం పెరిగేందుకు తీసుకోవలసిన చర్యలపై కన్వీనర్లతో చర్చించారు. సమావేశంలో చీకట్ల ఏసు, కుంచే మోహనరావు, కుంచే రాజేష్ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి



టీడీపీ బూత్ లెవెల్ కమిటీలో పాల్గొన్న ఇన్‌చార్జి అమూల్యను సన్మానిస్తున్న నాయకులు

అంతర్వేది, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో టీడీపీకి పోలింగ్ శాతం తక్కువ ఉన్న బూత్‌ల్లో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ రాజోలు ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. అంతర్వేది దేవస్థానం బూత్ నంబరు 16, అంతర్వేదిపాలెం బూత్ నంబరు 39లపై ఆమె శనివారం ఆమె సమీక్షించారు. ఆయా గ్రామశాఖల అధ్యక్షతన బూత్ అబ్జర్వర్ హాజీముఖర్రం హుస్సేన్ పర్యవేక్షణలో అక్కడున్న పరిస్థితులను కార్యకర్తలతో మాట్లాడి ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానిక సమస్యలు, సామాజిక కుల సమీకరణలు, చేయాల్సిన అభివృద్ధి పనులు తదితర అంశాల గురించి స్థానిక నాయకులతో ఆమె చర్చించారు. కార్యక్రమంలో ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, పోతురాజు కృష్ణ, తిరుమాని ఆచార్యులు, పులగం రమేష్, వనమాలి మూలాస్వామి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విషయ నైపుణ్యం గుర్తించేందుకు బేస్‌లైన్ టెస్ట్



అమలాపురంలో ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ టెస్టను నిర్వహిస్తున్న జిల్లా పరిశీలకుడు రామకృష్ణ తదితరులు

అమలాపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విషయ నైపుణ్యం గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ టెస్టను నిర్వహిస్తున్నట్టు అమలాపురం ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ రామరాజు ఈకార్యక్రమాన్ని ప్రారంభించగా శనివారం అమలాపురం కేవీఎం పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలలో సర్వే చేపట్టారు. జిల్లా పరిశీలకునిగా సాయిరామకృష్ణ హాజరు కాగా తెలుగు, ఇంగ్లీషు, లెక్కల్లో విషయ నైపుణ్యాన్ని బేస్‌లైన్ పరీక్ష ద్వారా గుర్తించి సంబంధిత వివరాలను లిప్ యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో నోడల్ ప్రధానోపాధ్యాయుడు కాశి ఘనసత్యనారాయణ, హెచ్ఎం బి.సూర్యకాంతం పాల్గొన్నారు.

పాల్ ల్యాబ్ ప్రారంభం

అంతర్వేది, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రామేశ్వరం పీఎం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పాల్ ల్యాబ్‌ను సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు శనివారం ప్రారంభించారు. పాల్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి ఎంఈవో డి.కిశోర్‌కుమార్ విచ్చేసి విద్యార్థుల్లో నైపుణ్యం పెంచుటకు, పర్సనలైజ్డ్ అడ్‌ప్టేటింగ్ లెర్నింగ్ విధానంలో నేర్చుకుంటూ విద్యార్థిస్థాయిని పెంచుకోవచ్చునన్నారు. తెలుగు, ఇంగ్లీషు, గణితంలో విషయ పరిజ్ఞానాన్ని సాధించుటకు పాల్ ల్యాబ్ సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోల-2 మద్దాల వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ దేవ ఆనందలక్ష్మి, కె.ఏడుకొండలు, మంగెన శ్రీనివాస్,అల్లూరి మధురవిరామరాజు, బళ్ల విజయసారథి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూర్పుపాలెంలో అగ్నిప్రమాదం

మలికిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెంలో గొల్లపాలెం ఓఎన్జీసీ జీజీఎస్ పక్కన శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. మంచిగంటి రామకృష్ణకు చెందిన ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో రూ.1.50లక్షల నష్టం సంభవించింది. రాజోలు అగ్నిమాపక అధికారి కేవీస్ రమణ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

అల్లవరం,నవంబరు29(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం అంబేడ్కర్ నగర్‌లో వంద మంది వృద్ధులకు సామాజిక సేవా కార్యకర్త బండారు శ్రీదేవి రగ్గులు, బిస్కెట్లు, కేక్‌లు పంపిణీ చేశారు. శీతాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బండారు సత్య, భూపతి ప్రతిభ, యాళ్ల సోమరాజు, పొలమూరి చంద్రరావు, భూపతి భాస్కరరావు, ఇంజేటి గణపతి పాల్గొన్నారు.

కార్యదర్శి అబ్బాస్‌కు పదోన్నతి

మలికిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): లక్కవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండీ అబ్బాస్ అలీ పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా అంబాజీపేట బదిలీ అయ్యారు. శనివారం లక్కవరం పంచాయతీ కార్యాలయం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అబ్బాస్‌ను దుశ్శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, యాతం కృష్ణ, పలచోళ్ల నారాయణరావు, బాబ్జి, రాంబాబు, పద్మనాభం, బుజ్జి, రామలింగరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకర ఆహారంపై అవగాహన

మామిడికుదురు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర ఆహారంపై అవగాహన కల్పిస్తూ మామిడికుదురు జడ్పీఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటుచేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను నోషుగర్, లెస్ఆయిల్ అనే నినాదంతో వివిధ రకాల వంటకాలను విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు. కోనసీమ జిల్లా జీసీడీవో భీమారావు, ఒకేషన్ కోఆర్డినేటర్ కె.రమేష్‌లు ఈస్టాల్‌ను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు, ప్రశంసలు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఫ్రూట్ స్టాల్, విజిటెబుల్ స్టాల్, హెల్దీ స్నాక్స్, డ్రింక్స్, నట్స్, మిల్లెట్స్, సలాడ్స్ వంటి వాటిని ఐదు విభాగాలుగా ప్రదర్శించి అధికారుల ప్రశంసలు అందుకున్నారు. హెచ్ఎం బి.చిరంజీవిరావు, డి.సత్యనారాయణ, ఒకేషనల్ ట్రైనర్ జె.మౌనికాకృష్ణ, పి.సత్యశ్రీ, వై.మధు, గంటి బాను పాల్గొన్నారు.

పెండింగ్ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

రాజోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ పెండింగ్ బ్యాక్‌లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రాజోలులో ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల్లో నిరుద్యోగ యువత నేటికీ ఆర్థిక ఇబ్బందుల్లో జీవిస్తుండడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, వైస్ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి'

రాజోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బస్సుల్లో స్త్రీశక్తి అమలులో మహిళా ప్రయాణికులకు ఎదురవుతున్న సమస్యలు, సిబ్బందిపై పెరిగిన పనిభారాలపై తక్షణ పరిష్కారం కోరుతూ యునైటెడ్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రాజోలు ఆర్టీసీఎస్ డిపోలో శనివారం గేట్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏఎస్ నారాయణ మాట్లాడుతూ బస్సులు పెంచకుండా స్త్రీశక్తి పథకం అమలు చేయడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవ్వడమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. యూనియన్ డిపో కార్యదర్శి కేవీఎస్ వాసు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం కోసం ప్రభుత్వం 75రోజులకు రూ.400కోట్లు విడుదల చేసిందని తెలిపారు. డిపో మేనేజర్ జి.జేమ్స్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్షుడు కేవీఎస్ నారాయణ, కలీల్, వైబీ నీలిమా, జి.హేమవతి, సత్య, శ్రీనివాస్, నారాయణ, హరినాథ్ పాల్గొన్నారు.

డ్రెయిన్లలో వలకట్లు తొలగించకపోతే చర్యలు

అల్లవరం, నవంబరు29(ఆంధ్రజ్యోతి): లోయర్‌కౌశిక పంచనది, వాసాలతిప్ప తదితర డ్రెయిన్లలో వలకట్లు తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని డ్రెయిన్స్ ఏఈ కె.సునీత హెచ్చరించారు. పలు డ్రెయిన్లలో మత్స్యకారుల చేపల వలకట్లు, బరకాల వలకట్లతో చేలల్లో ముంపు తగ్గడం లేదన్నారు.

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

అంబాజీపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి అన్నారు. పార్టీ ఆదేశాలతో 60రోజుల ప్రణాళికలో భాగంగా మండలంలోని క్లస్టర్ పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీ శ్రేణులతో కలిసి పర్యటిస్తున్నామన్నారు. ఈసందర్భంగా మాచవరం పరిధిలోని 110, 111 పోలింగ్ బూత్ పరిధిలో ఆమె పర్యటించి పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. అలాగే మండలంలో పలు పోలింగ్ బూత్‌లను తమకు అప్పగించారని జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ మోకా ఆనందసాగర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, నాయకులు దొమ్మేటి శ్యామ్, వెంకటరామారావు, నేదునూరి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో డైట్ సీనియర్ లెక్చరర్ పరిశీలన

అంబాజీపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఛాత్రోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ అసెస్మెంట్‌ను నిర్వహిస్తున్న విధానాన్ని డైట్ సీనియర్ లెక్చరర్ కొమ్ముల వెంకట సూర్యనారాయణ పరిశీలించారు. నాగాబత్తులవారిపాలెం, పుల్లేటికుర్రు నెహ్రూనగర్, గంగలకుర్రు సిద్ధార్థ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలల్లో పలు అంశాలను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ గ్యారంటీ ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించడానికి అనువుగా కార్యాచరణ పథకాన్ని రూపొందిస్తున్నట్టు తెలిపారు. బేస్‌లైన్ అసెస్మెంట్ ఛాత్రోపాధ్యాయులు మృదుల, మణిమాల, స్రవంతి పాల్గొన్నారు

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి పాశర్లపూడిలంకకు చెందిన పితాని సూర్యనారాయణ-వెంకటరమాదేవి దంపతులు రూ.10,116 అందించారు. దాతకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

వైభవంగా ముగిసిన షష్ఠి మహోత్సవాలు

రాజోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కడలి కపోతేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, షష్ఠి తీర్థ మహోత్సవాల సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ ఈవో టి.నాగవిష్ణు తెలిపారు. కడలిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ షష్ఠి ఉత్సవాల సందర్భంగా కల్యాణంలో పాల్గొన్న దంపతుల ద్వారా రూ.1,33,362, కట్నకానుకల ద్వారా రూ.1,60,462, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,60,870, హుండీల ద్వారా రూ.2,46,635 మొత్తం రూ.7,01,329 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. హుండీలు తెరిచి కానుకలను లెక్కించగా 11నెలలకు రూ.3,29,337 ఆదాయం వచ్చిందని తెలిపారు.

చైతన్యం కోసం ఉపాధ్యాయులకు క్రీడలు

పి.గన్నవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీడా చైతన్యం కోసం ఉపాధ్యాయులకు ఎంఈవో కె.హెలీనా తెలిపారు. పి.గన్నవరం హైస్కూల్లో మండలస్థాయి టీచర్ గేమ్స్‌లో భాగంగా సెలక్షన్స్ నిర్వహించి అనంతరం మాట్లాడారు. మహిళలకు త్రోబాల్, పురుషులకు క్రికెట్ సెలక్షన్స్ మండల స్థాయి జట్టులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 చింతా వీరభద్రానందం, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.ఉమాదేవి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు



అంబాజీపేట: క్రీడా పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయులు

మామిడికుదురు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఉపాధ్యాయుల ఆటల పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈపోటీలను ఎంఈవోలు సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబు, ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి ప్రారంభించారు. మండల స్థాయి నుంచి పురుషుల క్రికెట్ జట్టు, మహిళల త్రోబాల్ జట్టును ఎంపిక చేయనున్నట్టు పీడీ ఎం.శ్రీధర్ తెలిపారు. డివిజన్ స్థాయిలో డిసెంబరులో జరిగే పోటీల్లో ఎంపికచేసిన జట్లు పాల్గొంటాయని పీడీ తెలిపారు. శనివారం క్రికెట్, కోకో పోటీల్లో ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించారు.మండలస్థాయిలోపురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్‌పోటీలు నిర్వహించారు. 16మందిని క్రికెట్ టీమ్‌కి, 12మందిని త్రోబాల్ టీమ్‌కి ఎంపికచేశారు. డిసెంబరు 13,14తేదీల్లో డివిజన్ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో ఈజట్లు పాల్గొంటాయన్నారు. ఎంఈవో కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎంలు సాయిరాం, వరప్రసాద్, కేశవాచార్యులు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.ఆదిలక్ష్మి, పీడీలు ఏ.సూర్యనారాయణ, పవన్‌కిషోర్, శ్రీనివాస్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): బట్టేలంక జిల్లాపరిషత్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను శనివారం ఎంఈవో ఎం.విజయశ్రీ ప్రారంభించారు. త్రోబాల్ నుంచి మహిళల బృందం, క్రికెట్ నుంచి పురుష ఉపాధ్యాయుల బృందాన్ని డిసెంబరు 13,14 తేదీల్లో డివిజన్ గేమ్స్‌కు పంపిస్తామని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో కేశనపల్లి ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, బట్టేలంక ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, పీఈటీ వి.కుమార్, ఎ.విజయశ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం న్యాపతిసుబ్బారావు పంతులు జడ్పీ హైస్కూలులో ఉపాధ్యాయుల క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉపాధ్యాయినీలకు త్రోబాల్, ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు జరిగాయి. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమీలు క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈపోటీల్లో విజేతలు డిసెంబరు 13,14తేదీల్లో డివిజన్‌స్థాయిలోజరిగే క్రీడల్లో పాల్గొంటారని ఎంఈవో కె.కిరణ్‌బాబు తెలిపారు. ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.వాసు, సర్పంచ్‌లు రాకావు విజయలక్ష్మి, వడ్డి సుభాషిణి, హెచ్ఎం ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ అధ్యక్షతన మండలంలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు స్కూల్ ఎడ్యుకేషన్ గేమ్స్ నిర్వహించారు. భీమనపల్లి హెచ్ఎం నూకల సత్యనారాయణ కెప్టెన్‌గా 16మంది క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యారు. ఉపాధ్యాయినుల నుంచి10మంది త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికల కమిటీ సభ్యులుగా పీడీలు గొలకోటి ఫణీంద్రకుమార్, కామన మధు, డి.సరస్వతి వ్యవహరించారు.

ర్యాలి కేశవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి

ఆత్రేయపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామునే స్వామివారికి వివిధ ఆర్జిత సేవలు నిర్వహించిన అనంతరం పలు రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తజనం ఆలయ ప్రదక్షిణ నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయ ప్రవేశం చేసుకున్న భక్తులకు స్వామివారి ఖ్యాతిని అర్చకులు వివరించారు. నిత్యాన్నదాన పథకానికి దాతలు విరాళాలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

కపిలేశ్వరపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అంగరలోనున్న శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఆలయ అర్చకుడు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక గ్రామస్తులతో పాటు ఆయా గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వైభవ వేంకటేశ్వరస్వామి

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఆలమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం గాంధీనగరం, చిలకపాడు మీదుగా దుళ్ల మెయిన్ రోడ్డుకు వెళ్లే రహదారి పనులను ఎంపీడీవో ఎ.రాజు శనివారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించకుండా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డు నిర్మాణంలో స్థానికంగా ఉన్న సమస్యలపై ఏర్పడిన వివాదంపై ఆయన స్థానికులు, కాంట్రాక్టర్‌తో చర్చించి సమస్యను పరిష్కరించారు. రోడ్డు పనులు వేగంగా చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొత్తపల్లి నగేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



మడికి-చిలకపాడు రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

హక్కుల పరిరక్షణకు ప్రజలు పోరాడాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉద్యోగులు, కార్మికులు, దళితులు, ప్రజలు రాజ్యాంగం కల్పించిన హక్కులు కోల్పోతున్నారని వారి హక్కులను కాపాడుకునేందుకు ప్రజలు పోరాటంలోకి రావాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.దుర్గాప్రసాద్, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి పి.వెంకట్‌నాయుడు, ఐఎఫ్‌టీయు రాష్ట్ర నాయకులు ఎం.యేసు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్.రాఘవులు పిలుపునిచ్చారు. శనివారం రామచంద్రపురం చెలికాని రామారావు స్మారక భవనంలో దివంగత గుర్రాల పరంజ్యోతి వర్ధంతి సభ నిర్వహించారు. పరంజ్యోతి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గుబ్బల ఆదినారాయణ, గంటా బాలరాజు, మహిళా సంఘం జిల్లా నాయకురాలు జి.సత్యవేణి, గ్యాస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గణేష్, గుండుపల్లి మంగాయమ్మ, పలివెల సుబ్బయ్య, లంక రాంబాబు, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

మార్కెట్ కమిటీ చైర్మన్ రిష్వంత్‌రాయ్

కె.గంగవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని రామచంద్రపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ అన్నారు. శనివారం ఆయన పామర్రు, కూళ్ల గ్రామాల్లో పర్యటించారు. రైతన్న మీకోసం కార్యక్రమాల్లో భాగంగా రైతులతో సమావేశమయ్యారు. రైతు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడమే కాకుండా 24 గంటల్లోపు రైతు ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తున్నామని తెలిపారు. రైతన్నా మీకోసం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం వ్యవసాయ శాఖ ఏడీఏ బి.నాగకుమార్, ఏవో ఏ.సద్గురు మూర్తి, అముజూరు సొసైటీ అధ్యక్షుడు పెంకే గోవిందరాజు, కోటిపల్లి సొసైటీ అధ్యక్షుడు గాలి వెంకటేష్, కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, చిట్టూరి రామ్మోహన్‌రావు, బలుసు శివప్రసాద్, వీపీఏలు గంజా హరిబాబు, భూషణం తదితరులు పాల్గొన్నారు.



కూళ్లలో రైతులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రిష్వంత్‌రాయ్ తదితరులు

గ్రామాల్లో రైతన్నా మీకోసం

మండపేట(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కేశవరం చినద్వారపూడి, ఇప్పనపాడు, తాపేశ్వరం తదితర గ్రామాల్లో శనివారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ సారథ్యంలో నిర్వహించారు. రైతన్నా మీకోసం కార్యక్రమంపై రైతులకు వివరించారు.

బాక్సింగ్ పోటీల్లో విదార్థినుల ప్రతిభ

రావులపాలెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 25న రాజమహేంద్రవరంలోని ఎస్‌కేఆర్ ఉమెన్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ స్థాయి ఇంటర్ కాలేజీ ఎట్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కె.తనుశ్రీ, బి.దివ్య, బి.దుర్గ పలు విభాగాల్లో సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. వారిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఎస్.చినబాబు, అధ్యాపకులు యు.సుభాషిణి, నర్సారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణకుమార్, పీడీ యువరాజ్, బాక్సింగ్ కోచ్ సత్యా, శ్రీసంధ్యతో పాటు పలువురు అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

సమాజానికి, కుటుంబానికి
మహిళల పాత్ర కీలకం
మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి

కె.గంగవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సమాజానికి, కుటుంబ శ్రేయస్సుకు మహిళలు వెన్నుముక లాంటి వారని రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. శనివారం కోటిపల్లి విజ్ఞాన భారతి పాఠశాలలో సప్తశక్తి సంఘం కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కుటుంబ నిర్వహణలో మహిళల పాత్రను వివరించారు. కార్యక్రమంలో శ్రీదేవిని విజ్ఞాన భారతి పాఠశాల చైర్మన్ కర్రి చిట్టిబాబు సన్మానించారు. కార్యక్రమంలో చిల్లే నాగేశ్వరరావు, పట్నాల శ్రీను, మాచర్రావు, గాదంశెట్టి శ్రీధర్, పాఠశాల కరస్పాండెంట్ బి.శివరావు ప్రధాన ఆచార్య శ్రీవిష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల ఆటల పోటీల ఎంపికలు

కపిలేశ్వరపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు జరిగిన ఆటల పోటీల ఎంపికలు జరిగాయి. మండలస్థాయి ఆటల పోటీల ఎంపికలను ఎంఈవో-2 విజయ్‌కుమార్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ప్రారంభించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయుల్లో పురుషుల క్రికెట్, మహిళల త్రోబాల్ జట్లను ఎంపిక చేశారు. ఈ రెండు జట్లు వచ్చేనెల డిసెంబరు 13, 14 తేదీల్లో రామచంద్రపురంలో జరిగే ఆటల పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మేకా సత్యనారాయణ, లెహర్‌బేగం, నాగూర్‌బేబీ, ఫాతిమా, సంధ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో నవజనార్దనస్వామి

జనార్దనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోని జనార్దనస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి తొలిహారతి నిర్వహించిన అనంతరం అర్చకుడు అంగర భగవాన్ అధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తొలిహారతిలో వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని పలు పూజలు జరిపారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



మండపేటలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన వాజ్‌పేయి విగ్రహం

వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తి

మండపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహాన్ని ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ప్రారంభోత్సవం చేస్తారని ఆ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ కె.సాయిరాం చెప్పారు. దీనికి కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, రాజమహేంద్రవరం అమలాపురం ఎంపీలు పురందరేశ్వరి, గంటి హరీష్‌మాధుర్‌తోపాటు రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, కూటమి నాయకులు, బీజేపీ శ్రేణులు హాజరవుతున్నారన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం తాపేశ్వరం వేడుక ఫంక్షన్ హాల్‌లో సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల క్రీడా పోటీలు శనివారం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో జరిగాయి. మండలంలో 50 మంది ఉపాధ్యాయులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. త్రోబాల్, క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన ఉపాధ్యాయులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల, డివిజన్ ఇన్‌చార్జిలు సీహెచ్ లక్ష్మీశ్రీనివాస్, ఆని శ్రీనివాస్ తెలిపారు. ఎంపికల్లో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి ఏవీవీ సత్యనారాయణ, ఉమ, కృష్ణమోహన్, రాఘవ, వి.నాగార్జున, ప్రసాద్, తేజ పాల్గొన్నారు.



మడికిలో వర్మికంపోస్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఆలమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం నిర్వహణలో కార్మికులు, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. మడికిలో శనివారం పారిశుధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. చెత్త సేకరణపై ఇంటింటికి వెళ్లి మహిళలతో చర్చించారు. చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించి దానిలో వర్మికంపోస్టు కేంద్రం వివరాలను సేకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరత్నం, పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విజయదుర్గ అమ్మవారి మహోత్సవం

ఆలమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బడుగువానిలంక పంట భూముల్లో ఉన్న విజయదుర్గ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ అధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలమూరు, కడియం, మండపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లోని రైతులు ఇక్కడ పంటలు సాగు చేస్తుంటారు. దీంతో సాగుకు ముందుగా అమ్మవారిని పూజించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేపట్టింది.

బిట్ బ్యాంక్‌ను ఆవిష్కరించిన ఆర్డీవో

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మోడరన్ విద్యా సంస్థ ప్రతి ఏడాది ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఉచితంగా అందించే బిట్ బ్యాంకును ఆర్డీవో అఖిల శనివారం ఆవిష్కరించారు. తొలి సంచికను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావులకు అందజేశారు.

కాలువ మూసుకుపోయినా పట్టదా..?

• సక్రమంగా సాగునీరు అందక రైతుల గగ్గోలు • చోద్యం చూస్తున్న ఇరిగేషన్ యంత్రాంగం

ఆలమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రబీ పంటకు సాగునీరు అంతంత మాత్రంగా సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 2000 సంవత్సరం వరకు రెండు పంటలకు ముందుగానే రైతులు తవ్వకాలు చేసుకుని సాగునీరు సరఫరా సక్రమంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకునేవారు. గ్రామాల వారీగా పంట కాలువలకు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రత్యేకంగా ఒకరిద్దరిని నియమించుకునే వారు. పంట కాలువల నిర్వహణకు సాగునీటి సంఘాల ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి సాగునీటి కాలువలను పూర్తిగా రైతులు వదిలేయడంతో సాగునీటి కాలువల దుస్థితి దెబ్బతిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. 2018 నుంచి పంట కాలువలను పూర్తిగా వదిలేయడంతో రైతులు అధిక శాతం మంది మోటారుబోర్లపై ఆధారపడాల్సి వచ్చింది. బోర్లు అందుబాటులోని రైతులు పంటకాలువ ద్వారా వచ్చే సాగునీరు పైనే ఇప్పటికీ సాగు చేస్తున్నారు.

సంధిపూడి కాలువ అధ్వానం

ఆలమూరు నుంచి వెదురుమూడి వరకు దాదాపు ఐదారు గ్రామాలకు సాగునీరు అం దించే సంధిపూడి కాలువ మరింత అధ్వానంగా మారింది. ఆలమూరు లాకు వద్ద నుంచి ఆలమూరు, చింతలూరు, సంధిపూడి, పినపళ్ల, సంధిపూడి, వెదురుమూడి, అంగరలలోని వేలాది ఎకరాలకు ఈ పంటకాలువ ద్వారా సాగునీరు సరఫరా జరుగుతోంది. ఈ కాలువను నిర్లక్ష్యం చేయడంతో వేలాది ఎకరాల వరిసాగుకు ఇబ్బందిగా మరిందని ఇటీవల కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు దృష్టికి ఆయా ప్రాంత రైతులు తీసుకెళ్లారు. దీనిపై ఇరిగేషన్, సాగునీటి సంఘాల ప్రతినిధులతో చర్చించి చర్యలు తీసుకుంటామని వారికి ఆయన హామీ ఇచ్చారు.



సందిపూడి వద్ద మూసుకుపోయిన పంటకాలువ

'మున్సిపల్ డీఈఈని ప్రభుత్వానికి సరెండర్ చేయండి'

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పురపాలక సంఘం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్ వైఖరిపై కౌన్సిలర్లు మండిపడ్డారు. ఆయన్ను తక్షణం ప్రభుత్వానికి సరెండర్ చేయాలని చైర్‌పర్సన్, కమిషనర్లను డిమాండు చేశారు. శనివారం రామచంద్రపురం పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఎజెండాలో 16 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అంశాలపై జరిగిన చర్చలో వెల్ల వాటర్ పథకం మోటారు రిపేర్లుకు రూ 3 లక్షలు కేటాయింపుపై వైస్‌చైర్మన్ కొలమూరి శివాజీ మాట్లాడుతూ చైర్‌పర్సన్ ప్రాజెక్టును స్వయంగా పరిశీలించాలని కోరారు. కుక్కల నివారణపై కమిషనర్ రాజు సభ్యులకు వివరించగా కౌన్సిలర్ పెంటపాటి దేవి మాట్లాడుతూ ప్రతి వార్డులో వంద నుంచి 150 కుక్కలు ఉన్నాయని వాటిని తరలించాలని కోరారు. సమావేశంలో జనసేన కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ డీఈ వైఖరిని ఎండగట్టారు. వైసీపీ విప్ వాడ్రేవు సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల అధికారులు, కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించగా డీఈ ఉన్నంత కాలం తాము మున్సిపాల్టీలో పనులు చేయబోమని చెప్పారన్నారు. కౌన్సిలర్ బావాల మంగామణి మాట్లాడుతూ డీఈ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ డీఈని సరెండరు చేయాలని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు పెట్టిన ప్రతిపాదనకు ఇంచుమించుగా కౌన్సిలర్లు అంతా లేచి మద్దతు ప్రకటించారు. సమావేశంలో కమిషనర్‌రాజు, వైస్ చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కొలమూరి శివాజీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డీఈఈపై ఫిర్యాదు: సమావేశం అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు డీఈపై కమిషనర్‌కు రాజుకు ఫిర్యాదు చేశారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్, కమిషనర్

తూర్పులో విలీనం చేయడంపై సంబరాలు



మండపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మండపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరిలో విలీనానికి కృషి చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కృషి మరవలేనిదని పలువురు కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు అన్నారు. మండపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ వాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఎంఎసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, పిల్లా తాతీలు, యరగతపు బాబ్జి, సర్పంచ్ లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

స్వీట్స్ పంపిణీ

కపిలేశ్వరపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడంపై మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని కాలేరు, నల్లూరు గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రజల ఆకాంక్ష నెరవేర్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్వీట్స్ పంచి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామస్తులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్ మరణం టీడీపీకి తీరనిలోటు

మండపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ మరణం టీడీపీకి తీరనిలోటని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. శనివారం ప్రకాష్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ప్రకాష్ చిత్రపటానికి జవహర్ నివాళులర్పించారు. ఆయన వెంట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్, బుంగ సునీల్‌దత్, మున్సిపల్ కౌన్సిలర్ సవరపు సతీష్ తదితరులు వున్నారు.



ప్రకాష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ తదితరులు

యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం



నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం స్థానిక మండపంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ జాబ్‌మేళాలో ఎంపికైన యువతీ, యువకులకు ఎమ్మెల్యే నియామకపు ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, ధరణాల రామకృష్ణ, కముజు గంగాధర్, జక్కంపూడి బాలాజీ, నల్లా వెంకటరమణ, కొప్పిశెట్టి ప్రసాద్, కముజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కంకణసేవ ఉత్సవం

కపిలేశ్వరపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కంకణసేవా ఉత్సవం జరిగింది. స్వామివారి కంకణసేవా ఉత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళా మండలి అంగర వారిచే హనుమాన్ చాలీసా, గీతా పారాయణ చేశారు. శుక్రవారం రాత్రి కోలాట భజన మండలి గురువు పంపన త్రిమూర్తులు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఆదివారం స్వామివారి శ్రీపుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ఈవో ఎం.శ్రీదేవి, ఆలయ కమిటీ తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ అభివృద్ధి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలి

కపిలేశ్వరపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 7న జరిగే రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్‌టీయూ అధ్యక్షులు పోతంశెట్టి దొరబాబు కోరారు. సంఘ సభ్యత్వ నమోదులో భాగంగా శనివారం ఆయన మండలంలో పర్యటించి ఉపాధ్యాయులను కలిసారు. వచ్చేనెల 7న ముక్తేశ్వరం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే కౌన్సిల్ సభలో ఉపాధ్యాయులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



మండపేట మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ట్రేడ్ లైసెన్స్ ఫీజుల పెంపుపై కౌన్సిల్‌లో చర్చ

మండపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో అజెండాలోని పలు అంశాలను ఆమోదించారు. ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజు పెంపు అంశం చర్చకు వచ్చినపుడు కౌన్సిల్ వ్యతిరేకించింది. ఫీజుల పెంపు తగదని 5శాతం మేర పెంపు సమంజసమని ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. అజెండాలోని పలు అంశాలను ఆమోదించారు. పట్టణ సుందరీకరణ, పార్కుల నిర్వహణపై సమావేశంలో చర్చించారు. గొల్లపుంతకాలనీలో ఆర్చి నిర్మాణం, వైఎస్ విగ్రహం ఏర్పాటు విషయం చర్చకు వచ్చినప్పుడు టెండరు పిలిచి పనులు ఎందుకు చేపట్టలేదని ఎమ్మెల్సీ తోట అధికారులు ప్రశ్నించగా తానే ఆ పనులు చేయవద్దని చెప్పినట్టు ఎమ్మెల్యే చెప్పారు. అక్కడ వేగుళ్ల వీర్రాజు పేరు ఉందని అనటంతో వారి మధ్య మాటల యుద్ధం జరిగింది. మొత్తం మీద మండపేట మున్సిపల్ సమావేశం వాడివేడిగా ముగిసింది. దోమల నిర్మూలన, ఫాగింగ్ మిషన్ల కొనుగోలుపై కూడా సభ్యులు ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో కమిషనర్ రంగారావు, డీఈఈ శ్రీనివాస్, అధికారులు, కౌన్సిలర్‌లు, వైస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.



ఆలమూరు శ్రీసిద్దార్థ హైస్కూల్‌లో విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

రీసైక్లింగ్‌లో విద్యార్థి ప్రతిభ

ఆలమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రీసైక్లింగ్ పోటీల్లో ఆలమూరు శ్రీసిద్దార్థ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో చాంపియన్‌షిప్ సాధించారు. ఐటీసీ సహకారంలో ఏజీఎం అధ్వర్యంలో నిర్వహించిన రీసైక్లింగ్ పోటీల్లో పాత పేపర్లను తిరిగి ఉపయోగించడం వల్ల చెట్లను పరిరక్షించవచ్చునని విద్యార్థులు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. రీసైక్లింగ్ పోటీల్లో చాపియన్ షిప్ సాధించిన విద్యార్థులను శనివారం స్థానిక స్కూల్ ఆవరణలో స్కూల్ డైరెక్టర్ ముల్లారావు అభినందించారు. కార్యక్రమంలో ఎస్.రాముడు, కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,28,407 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు, ఈవో డి.సురేష్‌బాబు తెలిపారు.

జగపతిరావు మృతికి సంతాపం

కె.గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూళ్ల గ్రామానికి చెందిన వ్యాపారవేత్త శ్రీనివాస హేచరీస్ అధినేత చిట్టూరి జగపతిరావు మృతితో కూళ్ల గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. ఆయన మృతికి కూటమి నాయకులు చిట్టూరి రామ్మోహన్‌రావు, చిట్టూరి ప్రకాశరావు, చిట్టూరి పెద్దబ్బు, చిట్టూరి చిన్నవాసు తదితరులు సంతాపం తెలిపారు.